నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం జూన్ 29, 2024 www.navatelangana.com

చిరు జల్లులు.. విత్తుకున్న రైతులు


విత్తనాలు విత్తుకుంటున్న రైతులు

నవతెలంగాణ-సదాశివనగర్

వర్షాకాలం సీజన్ ప్రారంభమైనా సరిపడా వర్షాలు కురవక రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇది వరకే పలువురు విత్తనాలు నాటుకోగా.. ఎండవేడికి మొలక దశలో పంటలు ఎండిపోతున్నాయి. కాగా శుక్రవారం మండలం వ్యాప్తంగా చిరు జల్లులు కురవడంతో పలువురు రైతులు విత్తనాలు విత్తుకునేందుకు ముందుకు వచ్చారు. ఇప్పటికే పంట ఆలస్యమవుతుండటంతో.. చిరు జల్లులు కురవగానే దుక్కిదున్ని విత్తనాలు నాటుతున్నారు. ఒక దిక్కు నేల పూర్తిగా నానలేదని తెలిసినా పంటలు వేయడం ఆలస్యం అవుతుందని విత్తుతున్నారు. ఇది వరకే పంటలు వేసిన రైతులు మళ్ళీ ఆకాశం వైపు చూస్తున్నారు. వర్షం కురువకపోతదా అన్న ధీమాతో విత్తనాలు వేస్తున్నట్టు రైతులు పేర్కొంటున్నారు.

పాత సామాను దుకాణంలో పాఠ్యపుస్తకాలు


ఆటోలో తరలుతున్న పాఠ్యపుస్తకాలు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

విద్యార్థులకు అందించాల్సిన పాఠ్య పుస్తకాలు పాత సామాను దుకాణంలో ప్రత్యక్షమైన ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గం లోని బీర్కూర్ మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ పుస్తకాలను బీర్కూర్ మండల కేంద్రంలో ఉన్న ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు అమ్మినట్లుగా కొనుగోలు చేసిన వ్యక్తి తెలిపారు. ఈ పాఠ్య పుస్తకాలు బీర్కూర్ మండలం లోని ఓ ప్రభుత్వ పాఠశాలకు చెందినవిగా గుర్తించారు. మండల కేంద్రం నుండి ఆటో నిండా పాఠ్యపుస్తకాలతో ఆటో వీరాపూర్ కు వెళ్ళింది అక్కడ పరిశీలించగా పాఠ్యపుస్తకాలు బీర్కూరు పాఠశాలకు చెందిన పాఠ్య పుస్తకాలుగా గుర్తించారు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు చేరాల్సిన పాఠ్యపుస్తకాలు ఇలా పక్కదారి పడుతున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

అదనపు గదులున్నా.. ఆరుబయటే చదువులు


నిర్మాణం పూర్తయి ప్రారంభించిన అదనపు తరగతులు

- యూనిఫాంలు వచ్చినా.. విద్యార్థులకు అందలే
- వివాదాస్పదంగా ధర్పల్లి హెచ్‌ఎం తీరు
- భర్తతో కలిసి వేధింపులకు పాల్పడుతున్నట్టు ఉపాధ్యాయులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు
- అయినా చర్యలు శూన్యం
- ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు స్పందించేనా..?


వరండాలో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ధర్పల్లి

విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూ కార్పోరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లల్లో సౌకర్యాలు కల్పిస్తూ విద్యాభివృద్ధికి ఒక వైపు ప్రభుత్వం కృషి చేస్తుంటే.. పలువురు తీరుతో వివాదాస్పదం అవుతుంది. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలోని హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదులు నిర్మించి ప్రారంభించినా.. ఇప్పటికీ అందులో పిల్లలకు పాఠాలు చెప్పకుండా ఆరు బయట వరండాలోనే చదువులు కొనసాగి స్తున్నారు. యూనిఫాంలు వచ్చినా.. ఇంకా విద్యార్థులకు అందజేయక పోవడం గమనార్హం. స్థానిక హెచ్‌ఎం తీరుతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సదరు హెచ్‌ఎం తన భర్తను స్కూల్‌కు తీసుకొస్తూ.. వేధింపులకు పాల్పడుతున్నట్టు ఉపాధ్యాయులు సైతం వాపోతున్నారు. ఇదే విషయమై విద్యాశాఖాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

ధర్పల్లి మండల కేంద్రంలోని హైస్కూల్‌లో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలో మొత్తం సుమారు 400 మంది విద్యార్థులు చదువుకుంటు న్నారు. స్కూల్‌లో మొత్తం 28 మంది ఉపాధ్యాయులున్నారు. విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా స్కూళ్లో రూ.1.35 కోట్లతో ఆరు అదనపు గదులు నిర్మించారు. ఇటీవల రూరల్ ఎమ్మెల్యే అట్టహాసంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం చేసుకొని దాదాపు 11 రోజులవుతున్నా.. ఇప్పటికీ ఆ గదులల్లో విద్యార్థులకు పాఠాలో బోధించకుండా ఆరుబయటే, వరండాలలో చదువు చెప్తున్నారు.

హెచ్‌ఎం తీరుపై సర్వత్రా విమర్శలు

ధర్పల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఘనజ్యోతి రాణిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత సెప్టెంబర్ మాసంలో హెచ్‌ఎంగా విధులు చేట్టారు. ఒంటెద్దు పోకడలతో తాను చెప్పిందే శాసనంగా ఆమె భర్తను తాను విధులు నిర్వహిస్తున్న పాఠశాలకు తీసుకురావడమే కాకుండా, నేరుగా భర్తను తన సీటులో కూర్చోబెట్టడు తున్నట్టు తోటి ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

ఎప్పుడు చూసినా ఆమె, ఆమె భర్త ఇద్దరు హెచ్‌ఎం గదిలోనే కూర్చుంటూ ఉండటంతో, తోటి ఉపాధ్యాయురాళ్లు హెచ్‌ఎంతో మాట్లాడేందుకు ఇబ్బందులు పడుతున్నట్టు సమాచారం. సెలవు అడిగేందుకు ఇబ్బందిగా మారిందని, సెలవులు తీసుకునేందుకు కారణాలు తన భర్త ముందే అడుగుతుండగా తాము ఓ పురుషుని ముందు తమ సమస్యలు ఎలా వివరించాలో తోచక మహిళా ఉపాధ్యాయులు వాపోతున్న ఘటనలు అనేకం చోటుచేసు కుంటున్నాయి.

హెచ్‌ఎం భర్త పెత్తనం.. ఆగదాలపై ఫిర్యాదు

హెచ్‌ఎం కంటే ఆమె భర్త పెత్తనం చెలాయిస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులను కొడుతున్నాడని, మహిళ ఉపాధ్యాయురాళ్ల వీడియోలు తీస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో మహిళా ఉపాధ్యాయులు భయాందోళనలతో వారు పాఠశాలకు రావడానికి ఇబ్బంది పడుతున్నట్టు సమాచారం. తాము ఇలాంటి ప్రవర్తన గల వారిని ఎక్కడా చూడలేదని, తాము విధులు చేయబోమని పాఠశాలకు చెందిన 26 మంది ఉపాధ్యాయులు లిఖిత పూర్వకంగా కమ్యూనిటీ మొబిలేషన్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావుకు రెండువారాల క్రితం ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి విచారణ చేపట్టకపోవడం గమనార్హం.

ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంలో ఉన్న ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని ఓ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశాడు. తమస్టాఫ్‌కు టీ సైతం తాగొద్దని ఆంక్షలు విధించారని వాపోయారు.

ఎమ్మెల్యేకు గ్రామస్తుల ఫిర్యాదు

ఈనెల 11న పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు గదులను రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించినప్పటికీ అట్టి గదుల్లో విద్యార్థులకు క్లాసులు కొనసాగించడం లేదని ఎమ్మెల్యేకు గ్రామస్తులు సైతం ఫిర్యాదు చేశారు. ఉన్నత అధికారులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో గురువారం కేవలం ఒక క్లాసు విద్యార్థులను మాత్రమే కూర్చుండబెట్టారు.

విద్యార్థులకు సరిపడా గదులు ఉన్నా ఆరుబయటే క్లాసులు కొనసాగడంతో ఉన్నత అధికారుల ఆదేశాలు సైతం బేఖాతరు చేస్తున్నట్టు సుస్పష్టం. పాఠశాలలు ప్రారంభమై నేటికి 19 రోజులు గడుస్తున్నాయి. యూనిఫాంలు స్కూల్‌కు వచ్చినా.. ఇప్పటికి విద్యార్థులకు యూనిఫారంలు ఉన్న అందించకుండా కాలయాపన చేస్తున్నారు.

అలాగే మధ్యాహ్న భోజనం విద్యార్థులకు వడ్డించేందుకు ప్రభుత్వం అందించిన బియ్యాన్ని సైతం అమ్ముకున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన ఆధారాలున్నట్టు తెలిసింది. అధికారులు ఇతర పాఠశాలలకు తనిఖీలకొరకు వస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న ప్రధానోపాధ్యాయురాలు మిగిలించుకున్న బియ్యం సంచులను పాఠశాలలోని లైబ్రరీలో భద్రపరిచి, గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రి మాయాం చేసినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ విషయాలపై ఆరా తీసేందుకు శుక్రవారం నవతెలంగాణ విలేకరి సదరు స్కూల్‌ను సందర్శహించగా ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు నాగరాణి ఉన్నారు. వివరణ కోరగా తనకేమి తెలియదని, తాను ఈమధ్యే వచ్చినట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు ఘనజ్యోతి రాణి స్కూల్‌కు రాలేదని, తాను ఇంచార్జీగా ఉన్నానని తెలిపారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకుంటారో లేదో మామూలుగా తీసుకొని వదిలేస్తారో వేచిచూడాలి.

జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్‌లు పెంచాలి

- సమన్వయంతో సమర్థవంతంగా పనిచేయాలి
- పలు కాలేజీలను సందర్శించిన డీఐఈవో రవికుమార్

నవతెలంగాణ-ఆర్మూర్/బాల్కొండ/మోర్తాడ్


అధ్యాపకులతో మాట్లాడుతున్న డీఐఈవో

ప్రతి కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, బోధనేత ర సిబ్బంది సమ న్వయం సహకారంతో సమర్థవంతం గా పని చేయాలని డీఐఈవో రవికుమార్ సూచించారు. ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులు బోధనేతర సిబ్బంది అడ్మిషన్లపై అధిక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను ప్రచారం నిర్వహిస్తూ 10వ తరగతి పాస్ విద్యార్థులను కళాశాలలో చేర్పించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌లోని బాలుర, బాలికల, మోర్తాడ్, బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ పై, అకాడమిక్ క్యాలెండర్ నిర్వహణ, గత మార్చి, సప్లమెంటరీ పరీక్షలలో ఉత్తీర్ణత శాతం పై పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఉత్తీర్ణత శాతం పెంచడానికి ప్రతి అధ్యాపకుడు తన వంతు కృషి చేయాలని సమర్థవంతంగా పనిచేయించడానికి ప్రిన్సిపాల్ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కళాశాలలో ఏవైనా సమస్యలున్న తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బొగ్గు గనులను వేలం వేయొద్దు

- సింగరేణికి కేటాయించాలి సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

బొగ్గు గనుల వేలంపాటను ఆపి సింగరేణికి కేటాయించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి కలెక్టరేట్ ఏవో కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ బీజెపి ప్రభుత్వం ఆరు లక్షల కోట్ల రూపాయలు ప్రభుత్వ సంస్థల ఆస్తులను నిధులను సమీకరించేం దుకు నిర్ణయించిందని అందులో భాగంగానే బొగ్గు గనుల వేలం ద్వారా 28 వేల 700 కోట్ల రూపాయలు రాబట్టడానికి బొగ్గు గనుల వేలం చేపడుతున్నట్టు తెలిపారు. రాష్ట్రం నుండి ఎన్నికై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న జి కిషన్ రెడ్డి తెలంగాణ కు చెందిన మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు గనుల బ్లాక్ లను వేలం వెయ్యటానికి నిర్ణయించి హైదరాబాదులోనే వేలంపాటలను దగ్గరుండి కొనసాగించటం బిజెపి ప్రభుత్వం వైఖరి అర్థమవుతుందని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చర్యలతో సింగరేణిలో పనిచేసే 46 వేల మంది పర్మినెంట్ కార్మికులు, 26 వేల మంది కాంట్రాక్టర్ సోర్సింగ్ కార్మికుల ఉపాధి దెబ్బతినే పరిస్థితి రానున్నట్టు తెలిపారు. సింగరేణి బొగ్గు గనుల వలన వేలాది కోట్ల రూపాయల ప్రభుత్వా లకు వస్తున్నప్పటికీ ప్రయివేటు వారికి గనుల వేలం వేయడం సరికాదని అన్నారు. వేలం పాట నిలుపుదల చేసి సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, విగ్నేష్, నగర కమిటీ సభ్యులు కటారి రాములు, నరసయ్య, అనసూయ, అనిత లావణ్య దీపిక, సతీష్, కృష్ణ పాల్గొన్నారు.

పీవీ నర్సింహారావు సేవలు మరువలేనివి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


పీవి చిత్రపటానికి పూలమాలలతో నివాళి

దేశానికి పీవీ నర్సింహారావు చేసిన సేవలు ఎన్నటికీ మరులేనివని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ భవన్ నందు పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గా, దేశ ప్రధానిగా ప్రజలకు చేసిన సేవలు, సంస్కరణలు ఎన్నటికీ మారువలేనివని, భూ సంస్కరణల ద్వారా అందరికీ భూమి అందాలని చూసిన కార్యక్రమం ఆదర్శంగా నిలిచిందని గుర్తుచేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభినంగా ఉన్న సమయంలో ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన పీవీ నరసింహారావు తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణల ద్వారా దేశం అభివృద్ధి బాటలో ప్రయణించిందని తెలిపారు. ఆయన ఆశయాలను, ఆలోచనలు యువత ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పార్టీ నగర అధ్యక్షులు కేశ వేణు, జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు వేణు రాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, కేశ రాజు, సాయి కిరణ్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.



నోటికి నల్లగుడ్డలతో నిరసన

పేపర్ లీకేజీపై ప్రశ్నిస్తే నిర్బంధాలా..?

- మోడీ హయాంలో అప్రకటిత ఎమర్జెన్సీ
- విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నోటికి నల్ల బట్ట కట్టుకొని నిరసన

నవతెలంగాణ-కామారెడ్డి

దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీని కొనసాగిస్తున్నట్టు విద్యార్థి సంఘాల నాయకులు విమర్శించారు. ప్రశ్న పత్రాల లీకేజీపై ప్రశ్నించే వారిని నిర్బంధిస్తూ లాఠీ చార్జీ చేస్తున్నారన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం నోటికి నల్లబట్ట కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. నలభై లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టి విద్యను వ్యాపారం చేసి అంగట్లో సరుకు లాగా 30 లక్షల నుంచి 50 లక్షల కు నీట్, నెట్ పేపర్లని అమ్ముకునే విధానం చూస్తే పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలను ఆదాయ వనరులుగా బిజెపి ప్రభుత్వం చూస్తుందనేది అర్థమవుతుందన్నారు.

పేరుకు ఎంక్వైరీ కమిషన్ వేస్తున్నామని చెప్తున్నారని, ఎన్‌టిఎ చైర్మన్‌గా ప్రదీప్ కుమార్ జోషి ఉన్నప్పుడే పేపర్ లీకేజీ జరగగా, ఇప్పుడు అదే వ్యక్తిని ఎంక్వైరీ కమిషన్ ఆఫీసర్‌గా నియమించడం చూస్తుంటే బిజెపి ప్రభుత్వం పాత్రధారులను చూపిస్తూ సూత్రధారులను కాపాడే ప్రయత్నం చేస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. పేపర్ లీకేజీ కారకులైన నాయకులను అరెస్ట్ చేయకుండా వారిని కాపాడే ప్రయత్నం మోడీ ప్రభుత్వం చేస్తుందన్నారు. మోడీ నిరంకుశ పాలనపై ఢిల్లీలో నిరసన తెలుపు తున్న విద్యార్థి సంఘ నాయకుల పై లాఠీ చార్జ్ చేస్తూ అరెస్టు చేయడం సిగ్గుచేటు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా నిజాలు నిగ్గు తేల్చి పార్లమెంట్లో నీట్ నెట్ పేపర్ లీకేజీలపై చర్చలు జరిపి దోషులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విద్యార్థులకు ఏ విధంగా న్యాయం చేస్తారో తెలియజేయాలన్నారు. లేని పక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతంగా కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్, బివిఎం రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విటల్, భరత్, ప్రసన్న ,బుల్లెట్, సుఫియన్ , నితిన్, రాహుల్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

'పడావు'గా విత్తనోత్పత్తిక్షేత్రం

- మాల్‌తుమ్మెద వితనోత్పత్తి క్షేత్రంపై నిర్లక్ష్యపు నీడలు
- సాగునీరు లేక బీడుగా మారిన 630 ఎకరాలు
- పోచారం ప్రాజెక్టు నుంచి నేరుగా సాగునీటి సరఫరా ప్రతిపాదన కాగితాలకే పరిమితం
- కొత్త ప్రభుత్వమైనా చర్యలు చేపట్టేనా..?

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్




పంటలు వేయకపోవడంతో బీడుగా మారిన విత్తనక్షేత్రంలోని భూమి

కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండల శివారులో గల మాల్‌తుమ్మెద విత్తనోత్పత్తి క్షేత్రం నిర్లక్ష్యానికి గురవుతుంది. నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తి చేసి రైతులకు అందజేయాల్సి ఉండగా.. సరిపడా సాగునీరు లేక భూములు పడావుగా మారాయి. 700 ఎకరాలతో ప్రారంభించగా.. ఏటికేడూ సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తుంది. ప్రస్తుతం కేవలం 70 ఎకరాల్లో సాగు చేసేందుకు సిద్ధమవగా.. 630 ఎకరాలు పడావుగా మారాయి. అయితే పోచారం ప్రాజెక్టు నుంచి నేరుగా సాగునీరు అందించేందుకు ప్రతిపాదనలు రూపొందించినా.. కాగితాలకే పరిమితం అయ్యాయి.

నాగిరెడ్డిపేట్ మండలంలోని మాల్ తుమ్మెద విత్తనక్షేత్రంలో సాగు చేయడానికి 700 ఎకరాలు భూమి ఉండగా క్షేత్రం నిర్వహణకు అవసరమైన సాగునీరు లేకపోవడంతో విత్తన ఉత్పత్తి కుంటుపడింది. 700 ఎకరాల నుండి 70 ఎకరాలకు సాగు విస్తీర్ణం పడిపోయింది. ప్రస్తుతం 70 ఎకరాలు పండించడానికి ప్రతిపాదన పంపించినట్లు ఏడిఏ వీరస్వామి తెలిపారు.

1965 సంవత్సరంలో విత్తన ఉత్పత్తి క్షేత్రం ఏర్పాటు చేశారు. 700 ఎకరాల క్షేత్రానికి కేటాయించారు. అప్పటినుండి సోయా, కంది, వరి తదితర పంటలు సాగు చేశారు. ఇక్కడ ఉత్పత్తి చేసిన విత్తనాన్ని ఫౌండేషన్ సీడ్‌గా పంపించేవారు. కానీ నేడు పరిస్థితి దానికి విరుద్ధంగా మారింది. క్షేత్రంలో 17 బోర్లు ఉండగా ప్రస్తుతం 11 బోర్లు మాత్రమే పని చేస్తున్నాయి. 2018 సంవత్సరంలో 200 ఎకరాల్లో కంది, 100 ఎకరాలలో వరి, 100 ఎకరాలలో సోయాతో మొత్తం 400 ఎకరాల్లో పంటలు పండించారు. సరిపడా నీటి లభ్యత లేని కారణంగా ఫౌండేషన్ సీడ్ కు ఈ పంట అనుకూలించలేదు. దీంతో సాగు విస్తీర్ణం తగ్గించినట్లు ఏడిఏ వీరస్వామి తెలిపారు.


వితనక్షేత్రంలో పుష్కలమైన సాగునీరు అందించే బోర్లు లేకపోవడంతో పోచారం ప్రాజెక్టు నుండి నేరుగా వితన క్షేత్రానికి సాగునీరు అందించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతిపాదనలకు మోక్షం కలగకపోవడంతో ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైయ్యాయి. 700 ఎకరాలు భూమి ఉండగా పుష్కలమైన నీరు ఉంటే వేల ఎకరాలకు సీడ్ అందించే విత్తనక్షేత్రం ప్రస్తుతం కేవలం 70 ఎకరాలు సాగు చేయడానికి మాత్రమే పరిమితమైంది. మిగతా 630 ఎకరాలు బీడు భూమిగానే మిగిలి పోవాల్సిందే.

డిప్యూటేషన్ పై వెళ్లిన అధికారులు

మాల్ తుమ్మెద విత్తన క్షేత్రంలో పనిచేసే అధికారులు డిప్యూటేషన్ పై వెళ్లడంతో క్షేత్రంలో 10 మంది పోస్టులు ఉండాల్సి కానీ ప్రస్తుతం 7 గురు మాత్రమే పనిచేస్తున్నారు. 10 మంది ఇక్కడి నుండి జీతం పొందుతున్నారు. పదివేల ఎకరాలలో ఫౌండేషన్ సీడ్ అందించే ఈ క్షేత్రం ఇప్పుడు దీనాస్థితికి చేరింది.

పుష్కలంగా నీరుంటేనే సాగు సాధ్యం

ఏడిఏ వీరస్వామి



మాల్‌తుమ్మెద విత్తన క్షేత్రంలో సాగు చేయడానికి 700 ఎకరాలు ఉంది. కానీ పుష్కలంగా నీరు లేకపోవడంతో 700 ఎకరాలలో పంట సాగు చేయలేకపోతున్నాం. విత్తనోత్పత్తి క్షేత్రంలో ఫౌండేషన్ సీడ్ అందించే దిశగా పంటలు పండించాలి కాబట్టి పుష్కలమైన నీరు ఉండాలి. అప్పుడే రైతులకు అనువైన ఫౌండేషన్ సీడ్ అందించగలం. పుష్కలమైన నీరు అనుకూల పరిస్థితులు ఉంటే 700 ఎకరాలలో భూమి సాగు చేయవచ్చు. ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూర్చవచ్చు.

10 జిపిఏ సాధించిన విద్యార్థులకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పడకల్ జిల్లా పరిషత్ హైస్కూల్లో గోర్తి ఈశ్వర ట్రస్టు నిజామాబాద్ కామారెడ్డి ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు పాటుకూరి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ట్రస్టు వ్యవస్థాపకులు ఉషాబాల పవన్ కుమార్ సహకారంతో టెన్త్ క్లాస్‌లో పదికి పది వచ్చిన విద్యార్థులకు శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. హర్షిక, శంకర్‌కు 12500 వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు రెండు జిల్లాల బాధ్యులు పాటుకురి తిరుపతి రెడ్డి ప్రధానోపాధ్యాయులు సురేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పరిశుభ్రత పనులను చేపట్టాలి

- ఎంపీడీవో

నవతెలంగాణ - భీంగల్ రూరల్

గ్రామాలలో ప్రత్యేక పరిశుభ్రత పనులను చేపట్టాలని భీమ్‌గల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ కుమార్ అన్నారు. శుక్రవారం పురాణిపేట్, పల్లికొండ గ్రామాల్లో పరిశుభ్రత, దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. గ్రామంలో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ లేకుండా చూడాలని తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్లు లేని వారికోసం జరుగుతున్న సర్వే వివరాలను పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని అన్ని గ్రామాల కారోబార్లతో ఎంపీడీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ గంగా మోహన్,ఏపీవో జీ నర్సయ్య, సంబంధిత గ్రామాల పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయి సిబ్బంది ఉన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

- రుణమాఫీ ప్రకటించినందుకు హర్షం



సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

రైతులకు రుణమాఫీ ప్రకటించి నందుకు సీఎం చిత్రపటానికి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. మండలంలోని అర్గుల్ గ్రామంలోని అర్గుల్ సింగిల్ విండో కార్యవర్గ సమావేశం సంఘ అధ్యక్షులు ఆర్మూర్ గంగా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు రుణమాఫి ప్రకటించినందుకు తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి చిత్రపటానికి సంఘ అధ్యక్షులు, సంఘ డైరెక్టర్లు పాలాభిషేకం చేశారు. కార్యక్రమం లో సంఘ వైస్ చైర్మన్ అప్పాల నడిపి రాజన్న సంఘ డైరెక్టర్లు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు శోభకు సన్మానం



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని మంచిప్ప గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నుండి పదోన్నతిపై వెళుతున్న ఉపాధ్యాయు రాలు శోభను శుక్రవారం సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు ప్రేమ్ లాల్, ప్రసన్న, అనిత లక్ష్మణ్‌తో కలిసి సన్మానించారు వారితో పాటు గ్రామ పెద్దలు తూర్పు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

- ఎంపిడిఓ అనంత రావు



ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల పరిషత్ కార్యాలయంలో మండల కేంద్రంలోని ఎస్‌ఆర్ త్ పాలి క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిడిఓ అనంత రావు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్యమే మహాభాగ్యమని, ఈ శిబిరానికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొని ఉచిత చికిత్సలు చేయించుకున్నారు. అవసరం ఉన్నా వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రాజ్ కాంత్ రావు, సూపరింటెండెంట్ లక్ష్మారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ విమలబాయి, ఎస్ ఆర్ఆర్ పాలిక్లినిక్ వైద్యులు అనుదీప్‌తోపాటు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

- మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్ దేవి లావణ్య



పుస్తకాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందిస్తారని మున్సిపల్ చైర్ పర్సన్ వన్నెల్ దేవి లావణ్య అన్నారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్ అందజేస్తున్నారని, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నా కౌన్సిలర్లు లిక్కి శంకర్, జహీర్ అలీ, తార, వడ్ల బుచ్చన్న ,ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో పివి ఆర్థిక సంస్కరణలు కీలకం



నిజామాబాద్ సిటీ : పీవీ చిత్రపటాలకు పూలమాల వేస్తున్న నాయకులు



మోపాల్ : నివాళ్లు అర్పిస్తున్న బాజిరెడ్డి, నాయకులు



సిరికొండలో..

- ఘనంగా నివాళ్లు అర్పించిన నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

దేశ అభివృద్ధిలో పివి నరసింహారావు అర్థిక సంస్కరణలు కీలకమన్న మేయర్ అన్నారు. మాజీ ప్రధాని భారత రత్న పివి నరసింహా రావు జయంతి సందర్భంగా బోర్గం(పి) చౌరస్తాలోని విగ్రహానికి మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్ పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

మోపాల్: మండలంలోని బోర్గం(పి) చౌరస్తాలో గల మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు విగ్రహానికి తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఇందూరు శాఖ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి నుడా మాజీ చైర్మన్ ఈగ సంజీవరెడ్డి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ మన పివి నరసింహారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా దేశ ప్రధానమంత్రిగా సేవలందించారన్నారు. అలాగే గొప్ప ఆర్థిక సంస్కరణ వాది అని, ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల వల్లనే దేశం పురోగతి సాధిస్తుందని తెలిపారు. అప్పుడు అస్తవ్యస్తంగా ఉన్న ఆర్థిక వ్యవస్థను ఒక గాడిలో పెట్టిన మహనీయుడని అని కొనియాడారు. గతంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పీవీ నరసింహారావు శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారని తెలిపారు అలాగే పివికి కచ్చితంగా భారతరత్న ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రోటే సురేష్ శర్మ, కోశాధికారి పుల్కల్ రమేష్, బ్రాహ్మణ సంఘం సభ్యులు అప్పల కిష్య పురుషోత్తం పట్వారి, ఉదయ బోధన్కర్, లక్ష్మీనారాయణ భరద్వాజ్ మేడిచర్ల, శ్రీనాథ్, మల్లికార్జున్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: భారత మాజీ ప్రధాని, భారతరత్న, బహుభాషాకోవిదుడు, భారతదేశ ఆర్థిక సంస్కరణల పితామహుడు పివి. నరసింహారావు 103వ జయంతిని సత్యశోధక్ పాఠశాలలో నిర్వహించారు. మొదటగా ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య పి.వి. చిత్రపటానికి పూలమాలనలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ రాజకీయ నేపథ్యం లేని కుటుంబంలో జన్మించిన పివి. నరసింహారావు ఆర్థిక సంక్షోభంతో దేశాభివృద్ధి అతాకుతలమై పోతున్న సందర్భంలో తన మేదస్సుతో ఆర్థిక సంస్కరణలను చేపట్టి యావత్ దేశాన్ని ప్రగతిపథవైపు నడిపించిన తెలుగు తేజమని కొనియాడారు. విద్యార్థిదశ నుండే ఉద్యమాల్లో పాల్గొని రాష్ట్ర, కేంద్ర స్థాయిలో వివిధ మంత్రిత్వ శాఖలు నిర్వర్తించి తన రాజకీయ చతురతతో దక్షిణ భారతదేశం నుండి తొలి ప్రధానిగా పనిచేశారని తెలిపారు. కవిగా అనువాదకుడిగా, భాషానిపుణిగా ఎన్నో పురస్కారాలు పొందిన పివి. అందరికి మార్గదర్శకుడన్నారు. నేటితరం ఆయన స్ఫూర్తితో దేశాభివృద్ధిలో భాగస్వాములయ్యేలా ప్రయత్నం చేసి నిజమైన నివాళులు అర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుంది

- ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేస్తాం
- రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తే ఆకాశంపై ఉమ్మివేసినట్టు
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని, ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేస్తామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్థానిక విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలపైన చిత్తశుద్ధితో ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడు నెలలకు ఎన్నికల కోడ్ వల్ల కార్యక్రమాలు ఆలస్యం అయ్యాయన్నారు. ఎన్నికల కోడ్ కంటే ముందే ప్రభుత్వం ఏర్పడ్డ మూడు నెలల్లోనే ఆరు గ్యారంటీల్లో నాలుగు గ్యారంటిలను కాంగ్రెస్ పార్టీ అమలు చేసిందన్నారు. అందులో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్యశ్రీ 10 లక్షల వరకు పెంచడం, 500 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్ అందించడం లాంటి నాలుగు గ్యారంటీలను అమలు చేసిందని తెలిపారు. ఈ విషయాన్ని బిజెపి, బిఆర్ఎస్ నాయకులు గమనించాలని ఆయన సూచించారు. వరంగల్ డిక్లరేషన్‌లో తెలిపిన రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ పథకాన్ని కూడా ఆగస్టు 15వ తేదీ వరకు అమలు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారన్నారు. రైతు రుణమాఫీ చేయలేదని బీఆర్ఎస్ నాయకులు గ్రామ సింహాలుగా అరుస్తున్నారని విమర్శించారు. పదేళ్లుగా కేంద్రంలో బిజెపి, పది సంవత్సరాల్లో రాష్ట్రంలోబీబిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండి ఇచ్చిన హామీలన్నింటిని తుంగలో తొక్కి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీపై మాట్లాడడం చూస్తుంటే బిజెపి బిఆర్ఎస్ నాయకులను గ్రామ సింహాలతో పోల్చడం సరైనదేనని ఆయన అన్నారు. బిజెపి ప్రభుత్వం పేద కుటుంబాలకు 15 లక్షల రూపాయలు ఇస్తామని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధాన ఎజెండాగా హామీలు ఇచ్చి వాటి అమలుకు ప్రణాళిక కూడా చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ డబుల్ బెడ్ రూమ్ ఇస్తామని, దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని, ఇంటికొక ఉద్యోగమని చెప్పి హామీలను అమలు చేయలేదని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గ్రామాల్లో బీఆర్ఎస్, బిజెపి కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారని, దీంతో రెండు ఒకటేనని బయటపడిందని అన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే దీక్షకు కూర్చుంటానని మాట్లాడుతున్నాడని కానీ రాకేష్ రెడ్డి ముందు తెలంగాణ రాష్ట్రానికి కావలసిన నిధులను ఇవ్వాల్సిందిగా మోడీతో మాట్లాడాలని సూచించారు. రాకేష్ రెడ్డి తన స్థాయిని మరిచి రేవంత్ రెడ్డి పై విమర్శలు చేస్తున్నాడని, వ్యక్తిగత ఎజెండాతో ఆర్మూర్ నియోజకవర్గంలో పనిచేస్తానని, ఎన్నికల్లో ఆర్మూర్ ప్రజలకు చెప్పి ఆరు నెలలు గడుస్తున్న ఎందుకు ఒక్క అభివృద్ధి పని కూడా చేయడం లేదని ప్రశ్నించారు. ఆచితూచి మాట్లాడాలని హితవు పలికారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సుంకేట రవి, జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు వేణు రాజ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డీ శ్రీనివాస్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొనగిరి భాస్కర్, టౌన్ అధ్యక్షులు నిమ్మ రాజేంద్ర ప్రసాద్, కో ఆప్షన్ మెంబర్ పాషా, మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ చిన్నోళ్ల రెడ్డి, ప్రదీప్, వేములవాడ జగదీష్, రంజిత్, శైలెందర్, రవి, రాజు, ప్రతాప్, సుంకరి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ టీకాపై శిక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ సంతోష్, శిక్షణలో పాల్గొన్న ఆశాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్య సిబ్బందికి, ఆశ కార్యకర్తలకు వయోజన బీసీజీ టీకాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణకు హాజరైన డాక్టర్ సంతోష్ మాట్లాడుతూ ఇప్పటివరకు చిన్న పిల్లలకు ఈ టీకా ఇచ్చేవారని, 2025 సంవత్సరం వరకు టిబి ని నిర్మూలించడమే లక్ష్యం దిశగా ముందుకు వెళున్నాము కాబట్టి పెద్దలకు కూడా బీసీజీ వ్యాక్సిన్ ఆగస్ట్ లో ఇవ్వబోతున్నామని తెలిపారు. ముందుగా క్షయ వ్యాధిగ్రస్థుల ఇంటిలో నివసిస్తున్న వారికి, 60సంవత్సరాలు ఇంపాక్ట్ వారికి, పొగత్రాగే వారికి, డయాబేటిక్ తో బాధ పడుతున్న వారికి, పోషకాహార లోపం వారికి ఈ వాక్సిన్ ఇస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ సుప్రియ, ఆరోగ్య విస్తీర్ణ అధికారి సత్యనారాయణ, జిల్లా టిబి కోఆర్డినేటర్ రవిగౌడ్, ఎం ఎల్ హెచ్ పి, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు సొసైటీ సర్వ సభ్య సమావేశం

నవతెలంగాణ-మక్లూ ర్

మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం అధ్వర్యంలో శనివారం సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు సొసైటీ చైర్మన్ భూరోల్ల అశోక్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

జీజీహెచ్‌లో కనీస మెడిసిన్స్ లేవు

- రోగులపట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారు..
- ఐద్వా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు

ప్రజలకు జీజీహెచ్‌లో అందాల్సిన కనీస మెడిసిన్ లేదని ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సుజాత అన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో సర్వే చేస్తున్న సందర్భంగా వచ్చిన సమస్యలపై సూపరింటెండెంట్ ప్రతిమ రాజ్‌కి శుక్రవారం ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈసదర్భంగా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. డోలోఫర్, పారాసెట్మల్, పాన్ టాప్, రాన్‌టాప్, ట్రోమడల్ అలాగే చిన్న పిల్లలకు జలుబు, దగ్గు జ్వరానికి ఇవ్వాల్సిన సిరప్‌లు కూడా లేవని అన్నారు. గర్భిణీ స్త్రీలకు సంబంధించి స్కానింగ్ సెంటర్లో తప్పుడు రిపోర్టులు రావడం, వారికి రక్తస్రావం అవుతున్న కూడా నిర్లక్ష్యం వహించడం వల్ల నిరుపేదలు భయప్రాంతులకు గురై డిశ్చార్జ్ చేయకుండానే ప్రవేట్ హాస్పిటలో కీ వెళుతున్న పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. హాస్పటల్లో పనిచేస్తున్న సిబ్బంది వచ్చిన పేషెంట్స్‌తో దురుసుగా ప్రవర్తించడం వల్ల వచ్చిన రోగులు నిరాశ పడుతున్నారని అన్నారు. . ఎలాగే హాస్పటల్లో మౌలిక సదుపాయాలు కూడా సరిగ్గా లేవని ఎక్కడపడితే అక్కడ చెత్త ఉండడం వల్ల ఆస్పత్రిలోకి రాగానే దుర్గంధంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వీటన్నింటిపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు సరైన వైద్యాన్ని అందించాలని ఐద్వా మహిళా సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేశారు. లేదంటే హాస్పటల్ పై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించే వరకు ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఏ అనిత, జిల్లా ఉపాధ్యక్షురాలు కే లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

3న వైద్య శాఖ కార్యాలయం ముందు ధర్నా

- ఏఐటీయూసీ



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జులై 3న వైద్య శాఖ కార్యాలయం ముందు ఏఐటియుసి ఆధ్వర్యంలో జరిగే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య యూనియన్ జిల్లా అధ్యక్షులు పి సుధాకర్ అన్నారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా, జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చినప్పటికీ నెరవేర్చలేదని అన్నారు. సంవత్సరానికి 23 జాతీయ, పండుగ, ఆర్థిక సెలవులు ఇస్తామని అధికారులు రాతపూర్వకంగా హామీ ఇచ్చిన అమలుపరచలేదని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికై జూలై 3 న హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ల కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని సందర్భంగా కోరారు అధికారులకు వినతి పత్రం సమర్పించిన వారిలో యూనియన్ నాయకులు హైమది బేగం, భాగ్యలక్ష్మి, కవిత, రోజా పాల్గొన్నారు.

నూతన సిఐకి స్వాగతం పలికిన దళిత ఐక్య కమిటీ సభ్యులు



సీఐని సన్మానిస్తున్న దళిత ఐక్య కమిటీ సభ్యులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

నూతనంగా వచ్చిన సిఐని దళిత ఐక్య సంఘటన కమిటీ సభ్యులు శుక్రవారం స్వాగతం పలికారు. బెజ్జోరాలో జరిగిన ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాంతయ్య, అధ్యక్షులు గడలా ప్రసాద్, రాజేందర్, యోనా సంపత్,సునీల్, కూన రమేష్,రతన్ నరసయ్య, నవీన్, రాజేందర్, రత్నయ్య,లక్ష్మణ్ బట్టు అనిల్ తదితరులు పాల్గొన్నారు..

కుల బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు వినతి

నవతెలంగాణ-ఆర్మూర్

ఏడు సంవత్సరాల నుండి కుల బహిష్కరణ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారి రాజా గౌడ్ కు హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో బాధిత వ్యక్తి శుక్రవారం ఫిర్యాదు చేశారు. భీంగల్ మండలంలోని బడాభీంగల్ గ్రామానికి చెందిన లుక్కుడి సుజ్జు రావు ముదిరాజ్ కులానికి చెందిన వాడని అన్నారు. ఏడు సంవత్సరాల నుండి కుల బహిష్కరణతో గ్రామంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. తగిన న్యాయం చేయాలని వారు కోరారు.

టీపీసీసీ అధ్యక్షునిగా మధుయాష్కిగౌడ్‌ను నియమించాలి

- యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ మధుసూదన్‌రెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి

టీపీసీసీ అధ్యక్షునిగా మధుయాష్కిగౌడ్‌ను నియమించాలని యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ మధుసూదన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీతో పాటు అధినేత రాహుల్ గాంధీకి, ప్రియాంక గాంధీకి, కాంగ్రెస్ సీనియర్ మంత్రులకు ఎమ్మెల్యేలకు, నాయకులకు ఆయన విజ్ఞప్తి చేశారు. రాహుల్ గాంధీతో దగ్గర సంబంధాలు కలిగి ఉండి సన్నిహితుడిగా మెలిగిన మాజీ నిజామాబాద్ ఎంపీ మధుయాష్కి గౌడ్‌ను టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించాలని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశాడని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ హైకమాండ్ ఆలోచించి మదుయాష్కిగౌడ్‌కు టిపిసిసిగా పగ్గాలు అందించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

నవతెలంగాణ
3
కామారెడ్డి
శనివారం | జూన్ 29, 2024 | www.navatelangana.com

శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి మోడీ ఇచ్చిన సందేశాన్ని కార్యరూపం దాల్చడానికి, శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జి యెండల లక్ష్మీనారాయణ ఆదేశానుసారం "ఏక్ పెడ్-మా కే నామ్ - అమ్మ పేరిట ఒక మొక్క" కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతున్నామని, దానికై మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు.


మొక్కలు పంపిణీ చేస్తున్న నాయకులు

నూతన చట్టాలపై అవగాహన అవసరం


పాల్గొన్న జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది

- జిల్లా అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) కే. నరసింహారెడ్డి
- జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి ముగిసిన శిక్షణా తరగతులు

నవతెలంగాణ-కామారెడ్డి

నూతన చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) కే. నరసింహారెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాలప్రకారం నూతన చట్టాలపై జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి దశల వారీగా ఇచ్చిన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క పోలీసు అధికారి కొత్త చట్టాల గురించి పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అన్నారు. జులై ఒకటో తేదీ నుంచి అమలులోకి రానున్న నూతన చట్టాల పట్ల ప్రతి ఒక్క పోలీసు అధికారి, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని ఉద్దేశంతో జిల్లాలోని ప్రతి అధికారులకు, సిబ్బందికి ఈ శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్టు వివరించారు. జులై 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా కొత్త చట్టాలను అమలు చేస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అందుకు అనుగుణంగా కొత్త చట్టాలను అనుసరిస్తూ ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత(బి.ఎన్.ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం-2023 పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వహించగలమని సూచించారు. కొత్త చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన రావాలంటే ప్రతి ఒక్కరిలో నేర్చుకోవాలనే తపన ఉన్నప్పుడే అది సాధ్యమవుతుందన్నారు. అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ కొత్త చట్టాలను నేర్చుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఈ నూతన చట్టాలపై పోలీసు అధికారులకు, సిబ్బందికి శిక్షణ తరగతులను ఏర్పాటు చేయడంలో సమన్వయాధికారిగా వ్యవహరించిన డీసీఆర్బీ డిఎస్పీ మదన్‌లాల్, పోలీసు అధికారులను అడిషనల్ ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ, డిఎస్పీ మదన్‌లాల్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా అడిషనల్ ఎస్‌పి

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మెగా ఆరోగ్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా శాఖ సహకారంతో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని బీంరాజ్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మెగా ఆరోగ్య వైద్య శిబిరంలో డాక్టర్ కె.విక్రమ్ 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 18 మందికి ఈసీజీ గుండె పరీక్షలు, 35 మందికి రక్తంలో షుగర్ పరీక్షలు, 16 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు రాజన్న మాట్లాడుతూ.. మారుమూల గ్రామాలలో ఉండే పేదలకు వైద్య సదుపాయాలను అందించాలనే ఉద్దేశంతో ఈ మెగా ఆరోగ్య వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలోని వయో వృద్ధులకు అంధత్వ నిర్మూలనకోసం కంటి వైద్య పరీక్షలను సైతం నిర్వహించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేస్తున్న ఆరోగ్య శిబిరాలకు విశేషమైన స్పందన లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ నాగరాజ్‌గౌడ్, కోశాధికారి నరసింహం, డివిజన్ అధ్యక్షులు రవిగౌడ్, మండల అధ్యక్షుడు బొల్లు శ్రీకాంత్, డాక్టర్ బీంరాజ్, వైద్య సిబ్బంది పద్మ, పుష్పా, సందీప్, లలిత, రెడ్‌క్రాస్ సభ్యులు బాలు, ముదాం సాయిలు, నవీన్, శ్రావణ్ పాల్గొన్నారు.

జూలై 5న ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-మద్నూర్

జులై 6న జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతారావు జన్మదినాన్ని పురస్కరించుకుని జూలై 5న నియోజకవర్గం స్థాయి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ఎమ్మెల్యే శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. జుక్కల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. జులై 5న నిర్వహించే ఉచిత వైద్య శిబిరం ఆ రోజున ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుందని, ఈ వైద్య శిబిరానికి హైదరాబాద్‌లోని వైద్య నిపుణుల రానున్నట్టు పేర్కొన్నారు. చిన్నా పెద్దా అందరూ ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-రామారెడ్డి

తెలంగాణలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు గల ఖాళీలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఉప్పల్వాయి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12-07- 2024లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత తల్లిదండ్రుల ఆదాయం రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంత తల్లిదండ్రుల ఆదాయం రూ.2లక్షలలోపు ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాఠశాలలు బదిలీ కోరుకునేవారు, 31-07-2024 లోపు రూ.100 రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సత్యనారాయణ సూచించారు.

సీల్డ్ టెండర్లను జులై 2, 7 తేదీలలో తెరవనున్నాం

- జిల్లా అల్ప సంఖ్యాక సంక్షేమ శాఖ అధికారి దయానంద్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా పరిధిలోని 9 మైనారిటీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఆహార దినుసులు, పండ్లు కూరగాయలు సరఫరా చేసేందుకు వేసిన సీల్డ్ టెండర్లను జులై 2, 7 తేదీలలో తెరవనున్నామని జిల్లా అల్ప సంఖ్యాక సంక్షేమ శాఖ అధికారి దయానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటి సరఫరా నిమిత్తం ఈ నెల 12 నుంచి 20 వరకు సీల్డ్ టెండర్లు స్వీకరించినట్టు ఆయన పేర్కొన్నారు. కూరగాయలు, పండ్లు, గుడ్లు, చికెన్‌కు సంబంధించిన సీల్డ్ టెండర్లు జులై 2న ఉదయం 11 గంటలకు, ఆహార దినుసులకు సంబంధించిన టెండర్లు జులై 5న ఉదయం 11 గంటలకు తెరువబడునని వివరించారు. ఈ విషయాన్ని టెండరుదారులు గమనించాలని ఆయన కోరారు.

మురళిని ఆదర్శంగా తీసుకోవాలి

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్


మురళి దంపతులను సన్మానిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని సుల్తాన్‌పేట్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన మురళిని పంచాయతీ కార్యదర్శులు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మద్నూర్ ఎంపీడీవో రాణి, జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి వెంకట నరసయ్య, పంచాయతీ కార్యదర్శుల సంఘం జోనల్ అధ్యక్షులు భాస్కర్ అన్నారు. శుక్రవారం పదవి విరమణ పొందిన మురళి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మురళి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. మురళిని ఆదర్శంగా తీసుకొని ప్రతి గ్రామపంచాయతీ కార్యదర్శి తమ విధులు సక్రమంగా నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని కొనియాడారు. సుల్తాన్‌పేట్ గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహించిన మురళి 25 సంవత్సరాల కాలంగా కారోబార్‌గా నిజామాబాద్ జిల్లాలో విధులు నిర్వహించగా రెండున్నర సంవత్సరాల క్రితం ప్రమోషన్ ద్వారా మద్నూర్ మండలంలోని సుల్తాన్‌పేట్ గ్రామ కార్యదర్శిగా విధుల్లో చేరారని తెలిపారు. ఈ రెండున్నర సంవత్సరాల కాలంగా ఆయన నిక్కచ్చిగా విధులు నిర్వర్తించారని చెప్పారు. కార్యక్రమంలో మద్నూర్ మండల గ్రామ కార్యదర్శులు సంఘం నాయకులు సందీప్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

- జిల్లా విద్యాశాఖ అధికారి రాజు

నవతెలంగాణ-సదాశివనగర్

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని జిల్లా విద్యాశాఖ అధికారి రాజు అన్నారు. శుక్రవారం జెడ్పిహెచ్ఎస్ ధర్మారావుపేట్ పాఠశాలల్లో సాంఘిక శాస్త్రం బోధిస్తున్న అంకం రాజేశ్వర్ ఉద్యోగ విరమణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖ అధికారి రాజు మాట్లాడుతూ.. రాజేశ్వర్ గత 30సంవత్సరాలుగా ఎన్నో అద్భుతమైన సేవలందించారని, నేటి ఉపాధ్యాయ సమాజానికి అతని జీవితం ఒక స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలపడానికి అతను చేసిన కృషి మరువలేనిదని, అతనిలో ఉన్న క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. అతని భావి జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని తెలిపారు. అనంతరం రాజేశ్వర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని కానీ ఎంతో మందిని ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయ వృత్తి చేపట్టి ఎంతో మందిని ఉన్నత స్థాయికి చేరేలా తీర్చిదిద్దిన రాజేశ్వర్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని తెలిపారు. అనంతరం రాజేశ్వర్‌ను పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్ర మంలో మండల విద్యాశాఖ అధికారి, హెడ్మాస్టర్ యెసఫ్, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ దామోదర్‌రెడ్డి, ఎంపిటిసి మహిపాల్ యాదవ్, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దేవుల, విజయ రామరాజు, వంశీధర్, పిఆర్టీయూ మండల అధ్యక్షులు రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ భాస్కర్, గ్రామ పెద్దలు రామాంజనేయులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం, బంధువులు, బాల్యమిత్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న డీఈవో

వ్యవసాయ కూలీలకు సమగ్రమైన చట్టం తేవాలి

- ఏఐపికేఎంఎస్ డిమాండ్
- ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-లింగంపేట్

వ్యవసాయ కూలీలకు సమగ్రమైన చట్టం తెచ్చి ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రూ.12వేలు చెల్లించాలని, అలాగే బీడీ, గీతా కార్మికులకు అందించే పింఛన్‌ను వ్యవసాయ కార్మికులకూ వర్తింపచేయాలని ఏఐపికేఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐపికెఎమ్ఎస్ జిల్లా అధ్యక్షుడు పరమేష్, సిపిఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బాలరాజ్ మాట్లాడుతూ.. దేశంలో ఈనాటి లెక్కల ప్రకారం 59 శాతం మంది వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నారని తెలిపారు. ఇందులో రెక్కలు తప్ప ఎలాంటి ఆస్తులు లేని 14 కోట్ల మంది వ్యవసాయ కార్మికులే ఉన్నారని, శ్రమను నమ్ముకుని జీవిస్తున్న వ్యవసాయ కార్మికులు చాలీచాలని వేతనాలతో జీవనం కొనసాగిస్తున్నారని ఆయన తెలిపారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ జరగడంతో ఉపాధి కోల్పోయి దిక్కుతోచని పరిస్థితిలో కార్మికులు కొట్టుమిట్టాడుతున్నారని, రోజురోజుకూ వీరి పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఉపాధిహామీకి నిధుల్లో కోత విధించడం వ్యవసాయ కార్మికుల పరిస్థితి మరింత గడ్డు పరిస్థితుల్లోకి వెళ్లిందన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా రూ.600 కూలీని పెంచాలని వారు డిమాండ్ చేశారు. పదేళ్లలో కార్పొరేట్లకు 30లక్షల కోట్లు రుణాలు మాఫీ చేశారని ఆయన మండిపడ్డారు. రెక్కలు తప్ప ఆస్తులు లేని వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి పూనుకోకుండా ఎగనామం పెట్టారని విమర్శించారు. ఈ దయనీయ పరిస్థితుల్లో వ్యవసాయ కూలీలను ప్రత్యేక వర్గం గుర్తించి సంక్షేమానికి కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే కార్మికులంతా ఏకమై పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం కార్యదర్శి అంబన్న, జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, రాపర్తి సాయిలు, శంకరన్న, చిన్న పెంటయ్య, ఒంటరిపల్లి సాయిలు, ఎం.సాయిలు, ఓ.వెంకటి, పి.సంగయ్య తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఏఐపికేఎంఎస్ నాయకులు

ప్రభుత్వ ఉద్యోగులు.. ప్రజా సేవకులు

- టిడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కృష్ణమాచారి
- టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో డీపీఆర్‌వో సన్మానం

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రభుత్వ ఉద్యోగులందరూ ప్రజాసేవకులేనని.. ప్రజలకు సేవలు అందించడంలో ముందుంటారని టిడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కృష్ణమాచారి అన్నారు. కామారెడ్డి జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి సుర శాంతికుమార్ ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా కామారెడ్డి టీడబ్ల్యూజెఎఫ్ సభ్యులు శుక్రవారం డిపిఆర్వో కార్యాలయంలో ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కృష్ణమాచారి మాట్లాడుతూ.. శాంతికుమార్ 1988 మే మాసంలో మహబూబ్‌నగర్ జిల్లాలో సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో టైపిస్టుగా చేరారని, అ తర్వాత సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొంది సంగారెడ్డి జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో 1999 నుంచి 2005 వరకు పనిచేశారని తెలిపారు. తిరిగి అక్కడి నుంచి నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారని వివరించారు. నిజామాబాద్ జిల్లా నుండి సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొంది రంగారెడ్డి జిల్లాలో పనిచేశారని, 2016లో సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ పొంది రీజనల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ కార్యాలయం హైదరాబాద్‌లో 2010 వరకు విధులు నిర్వహించారని, 2020లో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారిగా ప్రమోషన్ పొంది మెదక్ జిల్లా కేంద్రంలో పనిచేశారన్నారు. కామారెడ్డి జిల్లాకు 2020 అక్టోబర్‌లో బదిలీపై వచ్చారని, ఆయన ఉద్యోగ జీవితంలో నిబద్ధత కలిగి పని చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ కామారెడ్డి కన్వీనర్ కృష్ణమాచారి, అక్రిడేషన్ కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి, వేణు, ప్రవీణ్ గౌడ్, కరుణాకర్, సభ్యులు శ్రావణ్, రాజు డిపిఆర్వో కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.


డీపీఆర్వోను సన్మానిస్తున్న నాయకులు

సామాజిక తనిఖీకి సహకరించాలి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీలో భాగంగా జరిగే ప్రతి పనిలో సామాజిక తనిఖీ బృందానికి పూర్తి సమాచారం అందించి సహకరించాలని నసురుల్లాబాద్ ఎంపీడీవో నీలావతి తెలిపారు. శుక్రవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో ఉపాధిహామీ సిబ్బంది గ్రామ కార్యదర్శులు, సామాజిక తనిఖీ బృందంతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 2022-23కు సంబంధించిన ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రతి పనికీ సంబంధించిన వివరాలను సామాజిక తనిఖీ బృందానికి వివరించి గ్రామ కార్యదర్శి ఉపాధి హామీ సిబ్బంది సహకరించాలని ఆమె కోరారు.

కామారెడ్డి కోర్టు జడ్జి వరప్రసాద్‌ను కలిసిన జిల్లా కలెక్టర్


జడ్జికి మొక్కను అందజేస్తున్న జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి కోర్టు జడ్జి వరప్రసాద్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగావాన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి జడ్జి వరప్రసాద్‌కు పూల మొక్కను అందజేశారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసి అందజేత


కుటుంబానికి ఎల్‌వోసి అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామానికి చెందిన మంజుల గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధప డుతున్నారు. సమా చారాన్ని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్ర కరణ్‌రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి ప్రభుత్వ సలహాదా రులు షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లగా నిమ్స్ హాస్పిటల్లో వైద్య చికిత్స నిమిత్తం 2 లక్షల 50 వేల రూపాయల ఎల్‌వోసీ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, చందు, నారాయణ, స్వామి, సంజీవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మందు పంపిణీ


నులిపురుగుల మందు వేస్తున్న విస్తరణ అధికారి

నవతెలంగాణ-పోతంగల్

జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి కోటగిరి, పోతంగల్ మండలంలోని అన్ని గ్రామాల్లోని అంగన్వాడీ సెంటర్స్, కళాశాలలో, ప్రైవేట్ పాఠశాలల్లో ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం 1498 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు వివరించారు.

రూ.89,500లకు వారసంత వేలం

నవతెలంగాణ-నందిపేట్

డొంకేశ్వర్ మండల కేంద్రంలో వారసంత వేలం పాటను చింత ప్రశాంత్ రూ.89,500 లకు దక్కించుకున్నట్లు మండల పంచాయతీ అధికారి కిరణ్ కుమార్, పంచాయతీ సెక్రెటరీ శేఖర్ గౌడ్ తెలిపారు. ఈ వేలం పాటలో వచ్చిన నిధులను వారసంత అభివృద్ధి కొరకు ఖర్చు చేస్తామని పంచాయతీ కార్యదర్శి శేఖర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ నిధులను వేలం పాట దక్కించుకున్న వ్యక్తి 4 విడతల్లో నగదుగాని, చెక్కు రూపంలో పంచాయతీకి అందజేయనున్నట్లు ఆయన చెప్పారు.



వేలంపాటలో పాల్గొన్న పలువురు

నివేదికలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి

కార్యదర్శులతో రివ్యూ సమావేశంలో ఎంపీడీవో

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలో జరుగుతున్న పనులపై శుక్రవారం ఎంపిడిఓ బాలకృష్ణ గ్రామకార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మరుదొడ్లు, శానిటేషన్, హరితహారం, తదితర పనుల నివేదిక ఎప్పటికప్పుడు నమోదు చెయ్యాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిఓ రాజేష్, ఈసీ, ఏఈలు పాల్గొన్నారు.



పాల్గొన్న గ్రామకార్యదర్శులు, ఉపాధి సిబ్బంది

1న అకాడమీ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో అకాడమీ ఎక్సలెన్స్ అవార్డు జూలై 1న నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ అజయ్ విలేకరుల సమావేశంలో తెలిపారు. టివియువి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కన్వీనర్ అజయ్ మాట్లాడుతూ ఇంటర్‌లో అధిక మార్కులు సాధించి ప్రతిభ కనిపించిన విద్యార్థులకు సన్మానం చేయడం జరుగుతుందని అన్నారు. అకాడమీ ఎక్సెన్స్ అవార్డు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్ ముదిరాజ్ వస్తున్నారని తెలిపారు. సమావేశంలో నవీన్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు

అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, కంప్యూటర్ సైన్స్ బోధించుటకు అధ్యాపకుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సతీష్ తెలిపారు. పీజీలో 55 శాతం కలిగి ఉండి నెట్, సెట్, పీహెచ్‌డీ గల అభ్యర్థులు పూర్తి బయోడేటాతో జూలై 02 లోపు కళాశాలలో అందించాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9848581970 నెంబర్‌కు సంప్రదించాలని ప్రిన్సిపల్ తెలిపారు.

శ్మశానవాటిక, రోడ్డు సమస్య పరిష్కరించండి

- అధికారులను కలిసిన చేపూర్ గ్రామస్తులు




వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ యువకులు, నాయకులు శుక్రవారం ఆర్డిఓ ఏసీపీని కలిసి గ్రామ స్మశాన వాటిక, రోడ్డు సమస్య గురించి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ చేపూర్ గ్రామ శివారులో ఉన్న సర్వే నంబర్ 135/2 37 గుంటలు, సర్వే నంబర్ 135/3 31 గుంటలు, సర్వే నంబర్ 135/4 1.23 ఎకరాలు భూమి ఉందన్నారు. 25 సంవత్సరాల క్రితం చేపూర్ గ్రామానికి చెందిన తండ్రి కొడుకు సారంగి పెద్ద సాందన్న, విజయ్ అప్పటి రెవిన్యూ అధికారులతో కుమ్మక్కై ఈ భూమిపై కోర్టులో శ్మశాన వాటిక జంబి భూమి అని తీర్పు ఇచ్చిన కూడా అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అన్నారు. ఈ భూమి గ్రామానికి చెందినది అని అడిగితే గ్రామ అభివృద్ధి కమిటీపైన ఐదు అక్రమ ఎస్సీ, ఎస్టీ కేసులు . పెట్టించారన్నారు. గ్రామంలో పూర్వం నుండి జమ్మి పూజకు. గ్రామ దేవతల గుడులకు (పోచమ్మల గుడులకు) వెళ్లే దారిని మూసివేసి అక్రమ పంట వేస్తున్నారని తెలిపారు. ఇది అన్యాయమని ఎవరు అడిగినా బెదిరిస్తూ అక్రమ కేసులు పెట్టిస్తున్నాడని గ్రామస్తులు వాపోయారు. ఈ సమస్యపై అధికారుల వద్దకు, నాయకుల వద్దకు 20 సంవత్సరాల నుండి తిరిగిన పరిష్కరించడం లేదన్నారు. రెండు సంవత్సరాల క్రితం కెనాల్ స్థలంలో వైకుంఠధామం గత ప్రభుత్వం నిర్మించారని, బోరు మోటర్ వేసిన కూడా దానిని సారంగి విజయ్ ధ్వంసం చేసి బోరు హోల్‌ను మూసివేశారని అన్నారు. ఈ రోడ్డు పై నుండి పది సంవత్సరాల క్రితం మెటల్ రోడ్డు ప్రభుత్వం చేపూర్ నుండి లక్కోరా వరకు వేయించినా సారాంగి విజయ్ ధ్వంసం చేశాడని తెలిపారు. కలెక్టర్ విచారణ చేసి అక్రమ రిజిస్ట్రేషన్ ను రద్దు చేయాలని గ్రామ ప్రజలు కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇందూర్ సాయన్న, మాజీ ఎంపీటీసీ జన్నేపల్లి గంగాధర్, వీడీసీ అధ్యక్షుడు మేడిపల్లి శ్రీకాంత్, కోశాధికారి రుక్మాజి , గ్రామస్తులు సారంగి శాంతి కుమార్. సింధుకార్ చరణ్. దాసరి నాగరాజు. దాసరి శ్రీకాంత్. నర్సారెడ్డి .డి సాయన్న తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణకై ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ఎంపీఓ శివ చరణ్



కూలర్‌ను పరిశీలిస్తున్న ఎంపీవో, తదితరులు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఫ్రైడే డ్రై డే లో భాగంగా మండలంలోని పంచాయితీ కార్యదర్శులకు ఎంపీఓ శివ చరణ్ పలు సలహాలు, సూచనలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరిసరాల్లో ఉన్న పాత కూలర్లు, టైర్లు, నీరు ఆగే కుంటలు, వస్తువుల్లో కనీసం వారం రోజులకు ఒక సారైనా నీటిని తీసివేయాలని అన్నారు. నివసించే పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే ఈ వర్షాకాలంలో నిల్వ ఉన్న నీటిలో దోమలు లార్వా తయారుచేసే అవకాశం ఉందని తెలిపారు. లార్వా వల్ల దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ ప్రబలుతుందని అన్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. వర్షాకాలంలో ప్రజలు తరచూ జ్వరానికి గురి అవుతున్నట్లైతే మీకు దగ్గరలోని ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. గ్రామాల్లో దోమల వ్యాప్తి జరగకుండా ఉండడానికి పంచాయతీ కార్యదర్శులు తమవంతుగా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

బీసీజి సర్వే నిలిపివేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పారితోషకంలేని బీసీజి సర్వే నిలిపివేయాలని, వైద్య సేవలందిస్తున్న ఆశాలకు పరీక్షల నిర్వహణ రద్దుచేయాలని, ప్రతినెల రెండవ తేదీలోపు పారితోషికాలను చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆశా వర్కర్ల సమస్యలపైన డిఎంహెచ్ఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. పారితోషకం లేని బీసీజీ సర్వే రద్దు చేయాలని ఎక్కడలేనివిధంగా జిల్లాలో ప్రయోగాత్మకంగా బీసీజీ సర్వే పేరుతో కొత్త సంస్కరణ తీసుకువస్తున్నారన్నారు. ఉన్న పనులు చేయడానికి సమయం, శక్తి సరిపోవటం లేదని తెలిపారు. 19 సంవత్సరాలుగా గ్రామాల్లో బస్తీల్లో బీపీ, షుగర్, థైరాయిడ్, మాతా శిశు సంరక్షణ, కరోనా వంటి విపత్కర అనారోగ్య సమస్యలు ఏర్పడినప్పుడు ముందుండి పనిచేస్తున్నారని తెలిపారు. నేషనల్ హెల్త్ ఆర్గనైజేషన్ వీరిని హెల్త్ గ్లోబల్ లీడర్ గా గుర్తించారని, అలాంటి స్కిల్ ఆశా కార్యకర్తలకు మళ్లీ నూతన ప్రవేశ పరీక్ష విధానాన్ని తీసుకురావడం శోచనీయమని అన్నారు. ఈ పరీక్ష వల్ల ఆశా కార్యకర్తలు భయాందోళనలుకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కారం చేయకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా కోశాధికారి రేణుక జిల్లా ఉపాధ్యక్షులు లలిత పుష్ప తదితరులు పాల్గొన్నారు.

- ఆశాలకు పరీక్షలు నిర్వహించొద్దు
- ఫిక్స్‌డ్ వేతనం 18000 చెల్లించాలి : సీఐటీయూ



వినతిపత్రం అందజేస్తున్న నూర్జహాన్, ఆశాలు

మడిగెలకు ఓపెన్ టెండర్ వేయాలి

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలో పంత్ రోడ్‌లోగల మడిగెలకు ఓపెన్ టెండర్ వేయాలని బిజెపి ఫ్లోర్ లీడర్ జీవి నరసింహరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మడిగెల లీజు దారులు ఇతరులకు సబ్ లీజుకు అధిక మొత్తంలో అద్దెకు ఇచ్చుకొని, మున్సిపల్‌కు నామమాత్రం అద్దె చెల్లిస్తూ మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారని అన్నారు. జంబి హనుమాన్ పక్కన గల మడిగెలకు కూడా ఓపెన్ టెండర్ వేసి సబ్ లీజు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ధ్యాగా ఉదయ్ కుమార్, దొండి ప్రకాష్, 35వ వార్డు కౌన్సిలర్ ఆకుల సంగీత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్‌కు సీఎం ఇచ్చింది 'గాడిదగుడ్డు'

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నియోజకవర్గాలకు సీఎం రేవంత్‌రెడ్డి ఒక్క రూపాయి ఇచ్చిన పాపానపోలేదని, అర్బన్ నియోజకవర్గానికి రేవంత్ ఇచ్చింది గాడిద గుడ్డు అనినిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా ఎద్దేవా చేశారు. భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పత్రికసమావేశంలో నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన గాలికి వదిలేసి, ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడని అన్నారు. ముఖ్యమంత్రి సీటు కాపాడుకోవడం కోసం గడిచిన ఆరు నెలలో 11 సార్లు ఢిల్లీకి పోయి సోనియా, రాహుల్ చుట్టూ తిరగడానికే సరిపోయిందని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన విద్యుత్ కొనుగోలు కుంభకోనం, కాళేశ్వరం కుంభకోణం, గొర్రెల పంపిణీలో కుంభకోనం, ఫోన్ టాపింగ్ కుంభకోనాల నుండి కేసీఆర్‌ను కాపాడటానికి, బీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేయడానికి సోనియాతో రేవంత్ పావులు కదుపుతున్నారని అన్నారు. కీలకమైన శాఖలను రేవంత్ తన దగ్గర పెట్టుకొని విద్యారంగ సమస్యలు గాలికి వదిలి ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలికసౌకర్యాలు కల్పించలేని దుస్థితి ఉందని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ఫీజులు వసూళ్లు చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాటిపై చర్యలు లేవని తెలిపారు. రేవంత్, బట్టి విక్రమార్క సొంత నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా ఇంటిగ్రేట్ స్కూల్స్ నిర్మాణం జరుగుతుందని అన్నారు. ఏబీవీపీ రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తే పోలీసులు ఏబీవీపీ కార్యకర్తల పైన దాడిచేసి కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. పోలీస్ వ్యవస్థ కాంగ్రెస్ పార్టీకి, రేవంత్‌కి గులాంగిరి చేస్తే జిల్లా విడిచిపెట్టి వెళ్ళండి అని హెచ్చరించారు. రేవంత్ హోం శాఖను దగ్గర పెట్టుకొని రాష్ట్రంలో శాంతి భద్రత పైన దృష్టి పెట్టకుండా ప్రశ్నించే గొంతును అణచివేయాలని చూస్తే ఊరుకోమన్నారు. నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మినిస్టర్ జూపల్లి కృష్ణ రావు సొంత జిల్లాలో చెంచు మహిళను అతికిరాతకంగా లైంగికదాడి చేసిన పరిస్థితి చూస్తే రాష్ట్రంలో లాఅండ్ ఆర్డర్ పరిస్థితి ఎట్లా ఉందో అర్థమవుతుందన్నారు. పార్టీ ఫిరాయింపుల పైన ఉన్న శ్రద్ధ ప్రజలపైన, పాలన పైన ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. 100 రోజుల్లో అమలు చేస్తానన్న గ్యారంటీలు ఆరు నెలలు గడుస్తున్న ఒక్కటీ పూర్తిగా అమలు చేయాలేదని అన్నారు. రైతులు వానాకాలం పంటకు సిద్ధం అవుతున్న ఇప్పటివరకు రైతు భరోసాపై క్లారిటీ లేదని, పంట బోనస్ 500 గ్యారంటీకి దిక్కే లేదని ఎద్దేవా చేశారు. రైతు రుణమాఫీ అని చెప్పి కాలయాపన చేస్తూ రైతులను మభ్యపెడుతున్నారని, రుణమాఫీకి ఎటువంటి షరతులు లేకుండా ఏక కాలంలో రైతులందరికి 2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు రాజ్యాంగాన్ని అవహేళన చేసిన ఒవైసీ క్షమాపణ చెప్పాలన్నారు. సమావేశంలో బిజెపి జిల్లా నాయకులు, మునిసిపల్ కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నేడు వాహనాల వేలం

- ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్

నవతెలంగాణ-ఆర్మూర్

పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు నేడు పట్టణ ఎక్సైజ్ కార్యాలయంలో వేలం వేయడం జరుగుతుందని ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్ శుక్రవారం తెలిపారు. స్టేషన్ పరిధిలోని గజాయి, మత్తు పదార్థాల విక్రయ దారులపై ఎక్సైజ్ సిబ్బంది ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తూ దాడులు నిర్వహిస్తున్నామని అన్నారు. పట్టుబడిన వారిపై ఉన్నతాధికారుల ఆదేశానుసారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆరోగ్య నియమాలను పాటిస్తూ ధ్యానం చేయాలి

- జిల్లా పరిషత్ చైర్మన్ దాదాన్న గారి విట్టల్ రావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జడ్పీ చైర్మన్ , ఆకుల లలిత

నవతెలంగాణ-ఆర్మూర్

ఆరోగ్య నియమాలను పాటిస్తూ ధ్యానం చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు అన్నారు. నవనాథ సిద్ధేశ్వర పిరమిడ్ ధ్యానమహాశక్తి క్షేత్రం, పిరమిడ్ మెడిటేషన్ ఛానల్ పిఎంసి సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రావ్య గార్డెన్లో నిర్వహిస్తున్న పత్రీజీ ధ్యాన మహా యజ్ఞం శుక్రవారం ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి జడ్పీ చైర్మన్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే ఆకుల లలిత, జిల్లా పరిషత్ చైర్మన్ విట్టల్ రావు, పిఎంసి మేనేజింగ్ ట్రస్ట్ సేతు బాలకృష్ణ విచ్చేసి జ్యోతి ప్రజ్వలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మూడు రోజులపాటు ఉచితంగా భోజనం వసతి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతిరోజు ఈ కార్యక్రమంలో పాల్గొని ధ్యానాన్ని ఆత్మ జ్ఞానాన్ని అందుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పిఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి, సిద్దేశ్వర పిరమిడ్ చైర్మన్ తిరుమల గంగారం, బోధన్ ట్రస్ట్ చైర్మన్ నల్ల గంగారెడ్డి, అమరవాజీ శ్రీనివాస్, బొడ్డు దయానందు, మామిడిలక్ష్మారెడ్డి, నారాయణ రాజారాం, గంగమోహన్, అంకాపూర్ గంగారెడ్డి, మిట్టపల్లి గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డు మరమ్మతులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఖలీల్ వాడిలో హాస్పిటల్స్‌తో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో అత్యవసర సమయంలో అంబులెన్సు వంటి వాహనాలకు, నగర ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని తెలుసుకున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా వెంటనే స్పందించి మునిసిపల్ కమిషనర్‌తో మాట్లాడి వెంటనే రోడ్డు మరమత్తులు చేపట్టాలని ఆదేశించారు. లేకుంటే తన స్వంత నిధులతో రోడ్డు మరమత్తులు చేయిస్తానని తెలిపారు. వెంటనే స్పందించిన మునిసిపల్ అధికారులు నగరంలో రోడ్డు మరమత్తులు చేయించారు. ఈ సందర్భంగా నగర ప్రజలు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.



రోడ్డు బాగుచేస్తున్న దృశ్యం

వ్యభిచార గృహంపై దాడి.. బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకుడి అరెస్ట్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని సుభాష్ నగర్‌లోని వ్యభిచార కేంద్రంపై మూడో టౌన్ పోలీసులు దాడి నిర్వహించారు. ఈ సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు సుభాష్ నగర్ లోని వ్యభిచార కేంద్ర నిర్వాహకురాలితో పాటు ఇద్దరు మహిళలతో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర నాయకుడు పట్టుబడ్డారు. ఈ మేరకు మూడో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు మూడవ టౌన్ ఎస్సై ప్రవీణ్ తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో కార్మిక సంఘాల నాయకుడి ముసుగులో రాసలీలల వ్యవహారం బట్టబయలైందని పలువురు నగర ప్రజలు, నాయకులు అంటున్నారు. ఈ సమాచారం తెలియడంతో నిజామాబాద్ కార్మిక లోకం షాక్‌కు గురి అయ్యారు.

దండివెంకట్‌పై పెట్టిన తప్పుడు కేసుపై హైకోర్టును ఆశ్రయిస్తాం

- పరువు నష్టం కేసు వేయడానికి న్యాయ నిపుణులను సంప్రదిస్తాం
- బహుజ లెఫ్ట్ మహిళా సంఘం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజాసమస్యలపై ఉద్యమిస్తున్న సామాజిక విప్లవ కవి, రచయిత దండి వెంకట్‌పై పెట్టిన తప్పుడు కేసుపై విచారణ జరిపిన కేసు ఎత్తివేయాలని పోలీస్ ఉన్నతాధికారులకు బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సబ్బని లత విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ రోడ్లు భవనాల అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కుటుంబ సమస్యలు చెప్పుకోవడానికి ఈనెల 27న సుభాష్ నగర్ ప్రాంతానికి చెందిన ఒక మహిళ లక్ష్మీ బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్‌పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండివెంకట్‌కు ఫోన్ చేయడంతో సాయంత్రం 7 గంటలకు వస్తామని చెప్పామని తెలిపారు. దండివెంకట్ వెళ్లిన 10 నిమిషాల అనంతరం తాను వెళ్లానని లత అన్నారు. ఈ లోపు ఒకటవ టౌన్ సిఐ, 3వ టౌన్ ఎస్ఐ జీబులో వచ్చి దండి వెంకట్‌ను వన్‌టౌన్‌కు తీసుకుపోవడం 41ఎ నోటీస్ ఇచ్చి ఇంటికి పంపడంలో ఆంతర్యం ఏమిటో పోలీస్ ఉన్నతాధికారులు ఆలోచించించాలని అన్నారు. లక్ష్మి అనే మహిళ తాము ఒక పోలిస్ కేసు విషయంలో మాట్లాడాలని దండి వెంకట్ కి ఫోన్ చేశామని చెపుతున్న పోలీసులు ముందుగా అనుకున్న విధంగానే తమ పని తాము చేశారని లత ఆరోపించారు. ఈ తతంగమంతా తాను, తన కొడుకు. తమ పార్టీ ప్రజా సంఘాల కార్యకర్తల ముందే జరిగిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్‌పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్‌పై పెట్టిన తప్పుడు కేసుపై హైకోర్టును ఆశ్రయిస్తామని, అవసరమైతే పరువు నష్టం కేసు వేయడానికి న్యాయ నిపుణులను సంప్రదిస్తామని సబ్బని లత వెల్లడించారు. సమావేశంలో బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్ పి నగర నాయకులు తిట్టె రాజు, బిఎల్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, బిఎల్‌టియు నాయకులు జి. యాదయ్య, మోహన్ గౌడ్, కె. సహదేవ్, అన్నావుసాతే మాదిగ జిల్లా, నగర నాయకులు సాయి కాంబ్లే, గంగాధర్ గాయకవ్వాడ్, బహుజన లెఫ్ట్ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గీతాంజలి, జిల్లా ప్రధాన కార్యదర్శి దండు జ్యోతి, బహుజన శ్రామిక మహిళా. సంఘం జిల్లా కన్వీనర్ ఆశబాయ, నగర నాయకులు పాల్గొన్నారు.

బాల్కొండ : జిల్లాకేంద్రంలో బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్‌ను వ్యభిచారం కేసులో అరెస్టు చేయడాన్ని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు అబ్బగోని అశోక్ గౌడ్ ఖండించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ వ్యభిచార గృహంలో పట్టు పడ్డాడని ముద్ర వేసి ఎటువంటి ఆధారాలు లేకున్నా అరెస్టు చేశారని అన్నారు. జరిగిందని న్యాయ విచారణ జరపకుండా, వారికి మెడికల్ టెస్టులు చేయకుండా అరెస్టు చేసి నోటీసులు ఇవ్వడం సరికాదని అన్నారు. గిట్టని వారు పోలీసులకు తప్పుడు సమాచారం ఇచ్చారని వారిపైన పార్టీ తరపున నష్టపరిహారం కేసు వేస్తామని తెలియజేశారు. రాష్ట్ర డిజిపి , నిజామాబాద్ సిపి దీనిపై న్యాయపరమైన సమగ్ర విచారణ జరిపించాలని తెలిపారు. దీనికి బాధ్యులైన వారు ఎంతటి వారైనా సరే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జగదీశ్వర్, నాయకులు రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

చందూర్‌లో గ్రామ దేవతలకు జలాభిషేకం


జలాభిషేకంలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-వర్ని(చందూర్)

మండల కేంద్రంలోని చందూర్ గ్రామంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు శుక్రవారం జలాభిషేకం చేశారు. గ్రామ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో వర్షాలు కురువాలని, పడి పంటలు పుష్కలంగా పండాలని ప్రత్యేక పూజలు చేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ ప్యారం అశోక్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పోతారాజు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కర్లం సాయరెడ్డి, రాంరెడ్డి, పోతరాజు కొక్కొండు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జూలై 3న ఉషోదయ కళాశాలలో ప్రాంగణ నియమకాలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో జూలై 3 తేదీన తెలంగాణ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బహుళ జాతి సంస్థ అయిన జెన్‌ప్యాక్ ప్రతినిధులు ప్రాంగణ నియామకాలను చేపడుతున్నారని ఉషోదయ కళాశాల చైర్మన్ సూర్యప్రకాష్, డైరెక్టర్ దుష్యంత్, టాస్క్ జిల్లా మేనేజర్ శ్రీనాథ్‌రెడ్డి , జెన్‌కో ప్రతినిధి లావణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామకంలో బీ.ఎస్సీ, బీ.కాం, బీసీఏ, ఎంబీఏ, బిఈ, బిటెక్, డిగ్రీ చేసిన వారు హాజరు కావాలన్నారు. 2022 నుంచి 2024 వరకు డిగ్రీ చేసిన వారు అర్హులని తెలిపారు. కావున ఆసక్తిగలవారు అన్ని రకాల సర్టిఫికెట్లు తీసుకొని ఉదయం 9 గంటల నుంచి హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8978616777, 8341751259 నెంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

మొక్కలకు నీరందేలా చూడాలి

- నర్సరీని పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్


నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

నర్సరీలో మొక్కలకు నీరందేలా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. శుక్రవారం పట్టణం లోని 18వ వార్డులోని భవాని నర్సరీని ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నర్సరీలో పరిశుభ్రత ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు చెట్లకు నీళ్ల అందేలా చూడాలని, చుట్టుపక్కల శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలోని మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డ్ కౌన్సిలర్, మిర్జా ఆఫీస్ బేక్, పంపరి లత శీను, తేజపు మానస ప్రసాద్, మమత, సాయిబాబా, అనూష, ప్రసన్న, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

జీఆర్ కాలనీ మత్తడి వాగు పరిశీలన..

కామారెడ్డి పట్టణంలోని జీఆర్ కాలనీ మత్తడి వాగును మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మత్తడి లోనికి మురికి నీళ్ల రావడం వల్ల జీఆర్ కాలనీవాసులకు ఇబ్బంది అవుతున్నందున పిచ్చి మొక్కలను, రాళ్లను దగ్గరుండి తీయించినట్టు తెలిపారు. పనులు వేగవంతంగా చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలోని మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డ్ కౌన్సిలర్, పంబరి లత శీను, తేజపు మానస ప్రసాద్, మమత సాయిబాబా, అనూష, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

- పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రానికి చర్యలు


డోజర్‌తో పిచ్చిమొక్కలు తొలగింపు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయ సమీపంలో శుక్రవారం పిచ్చి మొక్కలు పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించినట్టు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి నరేష్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చుట్టుపక్కల పిచ్చి మొక్కలు ఉండడంతో వాటిని తొలగించారు. అదేవిధంగా ఆస్పత్రి చుట్టూ చెత్తచెదారం పేరుకుపోవడంతో డోజర్ సాయంతో శుభ్రం చేశారు. అదేవిధంగా బాలుర ఉన్నత పాఠశాలలో పిచ్చి మొక్కలను తొలగించారు. శుభ్రం చేశారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా శుభ్రం చేశారు. ఏడవ వార్డులో మురికి కాలువల్లో చెత్తచెదారం పేరుకుపోవడంతో మురికి కాలువలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి హిమబిందు, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్, బట్టు సాయిలు, మునీర్, ఆజాం, గ్రామపంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితరులున్నారు.

రైతు కుటుంబానికి బీమా చెక్కు అందజేత


బీమా చెక్కు అందజేస్తున్న సొసైటీ చైర్మెన్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మండలంలోని అంకొల్ తండాకు చెందిన మలోత్ హరి ప్రమాదవశాత్తు నాలుగు నెలల క్రితం మృతి చెందాడు. నసురుల్లాబాద్ మండలం దుర్కి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వం ఉండడంతో ప్రధాన మంత్రి కిసాన్ బీమా యోజన పథకం కింద ఒక్క లక్ష రూపాయల బీమా డబ్బులు మంజూరు కావడంతో శుక్రవారం దుర్కి సహకార సంఘంలో సంఘం చైర్మన్ డివిటి శ్రీనివాస్ యాదవ్ మృతుని కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ డిప్యూటీ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని అన్నారు. అలాగే సొసైటీలో సభ్యత్వం ఉన్న రైతులందరికీ పిఎం కిసాన్ యోజన పథకం వర్తించేలా చర్యలు చేపట్టనున్నట్టు వివరించారు. సొసైటీ డైరెక్టర్ రాములు మిద్దెల, బి.శ్రీనివాస్, బ్యాంక్ మేనేజర్ సందీప్, అసిస్టెంట్ మేనేజర్ భూమేష్, సొసైటీ కార్యదర్శి డి.గంగారం, సొసైటీ సిబ్బంది తదతరులున్నారు.

ఆరు ఇసుక టిప్పర్లు పట్టివేత

నవతెలంగాణ-రెంజల్/ఎడపల్లి

మండలంలోని సాటాపూర్ గ్రామం మీదుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్టు రెంజల్ ఎస్సై ఈ.సాయన్న తెలిపారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా సాటాపూర్ గ్రామంలో బైపాస్ రోడ్డు గుండా ఇసుక తరలిస్తున్నట్లు తమకు సమాచారం అందడంతో వాటిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ మూడు ఇసుక టిప్పర్లను తహసీల్దార్‌కు బైండోవర్ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మూడు ఇసుక టిప్పర్లు పట్టివేత..

ఎడపల్లి : గురువారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను పట్టుకొని ఎడపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. బోధన్ నుంచి నిజామాబాద్ వైపు ఇసుక లోడుతో వస్తున్న టిప్పర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కరెంట్ కోతలతో ఇబ్బందులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలో కరెంట్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక దిక్కు వర్షాలు లేక మరో దిక్కు కరెంట్ రాక పోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కరెంట్ రాత్రి పూట లేకపోవడంతో ఉక్కపోతకు గురవుతున్నారు.

పనులను వేగవంతం చేయాలి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి పాఠశాలలో చేపట్టిన పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల నిధులతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు పాఠశాలలు పున ప్రారంభం కావడంతో వారికి ఎలాంటి అసౌకర్యం కలగ కుండా యుద్ధ ప్రాతిపదికపైన పనులను ముగించాలని ఆయన పేర్కొన్నారు.

ఆ ఆరోపణల్లో వాస్తవం లేదు

- కలిసి అభివృద్ధి చేద్దాం
- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పేరిక శ్రీనివాస్


మాట్లాడుతున్న చైర్మన్ పేరిక శ్రీనివాస్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

భూతగాదాల్లో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రమేయం ఉన్నట్లు మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలో వాస్తవం లేదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పేర్క శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాన్సువాడ నియోజకవర్గంలోని పలు తగాదాల్లో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రమేయం ఉన్నట్లు మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి పలు సందర్భాల్లో ఆరోపణలు చేశారని, ఆ ఆరోపణలో ఎలాంటి వాస్తవం లేదని ఆయన ఖండించారు. నసురు ల్లాబాద్ మండలం నెమిలి గ్రామ శివారులో భూమి సమస్యలతో గత ఆరు మాసాల నుంచి ఇరువురు ఫిర్యాదులు చేసుకున్నారని, దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ తగాదాకు రాజకీ యాలకు ఎలాంటి సంబంధం లేదని వారి వ్యక్తిగత సమస్యని ఆ సమస్యను రాజకీయం చేయడం తగదని ఆయన హితవు పలికారు. నసురుల్లాబాద్ మండల కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ నాయకులతో కలిసి పని చేసేం దుకు తాము అంత సిద్ధంగా ఉన్నామన్నారు.

నసురుల్లాబాద్ మండల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో మండల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఇందులో ఒకరు పెద్ద, ఒకరు చిన్న అని తేడా లేకుండా పాత కాంగ్రెస్ నాయకులతో తాము కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇందులో వర్గాలున్నాయని ప్రచారం చేయడం సరికాదని వివరించారు. వీరి వెంట నసురుల్లాబాద్ ఎంపీపీ పాల్య విఠల్, జిల్లా కోఆప్షన్ మెంబర్ మజీద్, మాజీ ఎంపిటిసి కంది మల్లేష్, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ చుంచు సాయిలు, సీనియర్ నాయకులు ప్రతాప్ సింగ్, సక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవి అంటువ్యాధి కాదు


అవగాహన కల్పిస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్

నవతెలంగాణ-బోధన్

నెహ్రూ యువకేంద్రం, సాయి ఆదర్శ మహిళ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిటిసి కౌన్సిలర్ డి.రాజన్న మాట్లాడుతూ హెచ్‌ఐవిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అది అంటువ్యాధి కాదని అంటించుకునే వ్యాధి అని అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే ఎయిడ్స్‌పై ఇతరులకు అవగాహన కల్పించాలని సూచించారు. దేశ భవిష్యత్తు యువతపై ఉండాలని అన్నారు. యువత సన్మార్గంలో నడవాలని అన్నారు. హెచ్‌ఐవి ఎయిడ్స్ సోకినవారు భయపడవద్దు, అది సోకిన వారిని ప్రేమగా చూడాలని, వారికి ధైర్యాన్ని కల్పించాలన్నారు. హెచ్‌ఐవి వచ్చినవారు భయపడకుండా ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్, పద్మసింగ్, ప్రభు ఉన్నారు.

దోమలు వృద్ధి చెందకుండా చూడాలి

- బోధన్ డివిజన్ ఉపవైద్యాధికారి డాక్టర్ విద్య


కూలర్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ విద్య

నవతెలంగాణ-బోధన్

ఇంటి పరిసరాలలో మురికినీరు నిలువకుండా, దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని బోధన్ డివిజన్ ఉపవైద్యాధికారి డాక్టర్ విద్య అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆమె బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని ఇండ్లల్లో ఆమె నీరు నిల్వ ఉన్న వాటిని పరిశీలించారు. పనికిరాని వస్తువులలో నీరు నిల్వ ఉంటే కలిగే దష్పరిమాణాలపై కుటుంబ సభ్యులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటి సమీపంలో మురికినీరు నిలువ లేకుండా పాత టైర్లు పాత వస్తువులలో, ఇతరత్రా వాటిలో నీరు నిలువ ఉంటే దోమలు పెరుగుతాయని దానివల్ల అనేక రోగాలు వస్తాయని తెలిపారు. పనికిరాని వస్తువులలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఆక్యుప్రెషర్ చికిత్సతో బయో ఎనర్జీ


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-బోధన్

లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో శుక్రవారం బోధన్ జిల్లా గవర్నర్ వేమూరి లక్ష్మీ బోధన్ పట్టణంలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆక్యుప్రెషర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోగుల సౌకర్యార్థం బోధన్ పట్టణంలో రాజస్థాన్ డాక్టర్లచే ఆక్యుప్రెషర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రాజస్థాన్‌కు చెందిన డాక్టర్లు ఆక్యుప్రెషర్ వైద్య చికిత్సలు అందిస్తామని తెలిపారు. ఈ వైద్య శిబిరం ఏడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆక్యుప్రెషర్ చికిత్స నేచర్ క్యూర్ పద్ధతికి చెందినదని, దాంతో శరీరంలోని అన్ని అవయవాలు సక్రమంగా పనిచేస్తాయని అన్నారు. ఈ చికిత్స వలన బయో ఎనర్జీ కూడా ప్రసరించి వ్యాధి నిరోధక శక్తి పెంచుతుందన్నారు. ఈ క్యాంపు ఆక్యుప్రెషర్ రీసర్చ్ అండ్ ట్రీట్మెంట్ సెంటర్ జోద్పూర్ వారిచే నిర్వహించడం జరుగుతుందన్నారు. కేవలం రూ.200తో వారం రోజుల పాటు ఈ చికిత్స పొందవచ్చన్నారు. ఆక్యుప్రెషర్ చికిత్సలో భాగంగా మ్యాగ్నెటిక్ చికిత్స నిర్వహించనున్నట్టు థెరపీ డాక్టర్ జితేందర్, డాక్టర్ ప్రమోద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి ఫౌండర్ లయన్స్ పోలవరపు బసవేశ్వరరావు, జిల్లా క్యాబినెట్ సెక్రటరీ శ్రీనివాస్, జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ కొడాలి కిషోర్, రీజియన్ చైర్మన్ కొయ్యాడ శ్రీనివాస్‌గౌడ్, మాజీ రీజియన్ చైర్మన్లు అయ్యార్ చక్రవర్తి, శ్రీనివాసరాజు, సాయిబాబాగౌడ్, కేవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు కోసం వేలంపాట వాయిదా

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని మేనూరు గ్రామంలోని హనుమాన్ దేవస్థానానికి సంబంధించిన ఆలయ భూముల కౌలు వేలంపాటను శుక్రవారం నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు మేనూరు గ్రామపంచాయతీ ఆవరణలో అన్ని రకాలుగా సిద్ధం చేశారు. కాగా కౌలు వేలంపాటలో పాల్గొనేందుకు ఇద్దరు వ్యక్తులు డిపాజిట్ చేసినప్పటికీ అనివార్య కారణాలవల్ల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కౌలు వేలం వాయిదా వేసినట్టు అధికారులు తెలిపారు. మేనూర్ శివారు ప్రాంతంలో హనుమాన్ దేవస్థానానికి 148/1 లో7.08 ఎకరాలు అదేవిధంగా 148/2లో 7.08 ఎకరాల భూమి ఉంది. మొత్తం 14 ఎకరాల 16 గుంటల భూమి కోసం వేలంపాట నిర్వహించేందుకు అధికారులు పాల్గొన్నప్పటికీ అనివార్య కారణాలవల్ల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కౌలు వేలంపాట వాయిదా వేయవలసి వచ్చిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా అధికారిని కమలాబాయి, మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీధర్, గుమస్తా వేణు, మద్నూర్ రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్, మేనూర్ గ్రామ కార్యదర్శి సురేష్, తాజా మాజీ సర్పంచ్ విట్టల్ గురూజీ, ఆ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు తైబజార్ వేలం పాట

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని వారం సంత, రోజువారి సంతను నేడు భిక్కనూర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో వేలంపాట నిర్వహించనున్నట్టు మండల పంచాయతీ కార్యదర్శి మహేష్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని సూచించారు. ఎవరైతే అధిక పాట పాడుతారో వారికే తైబజార్ దక్కుతుందని సూచించారు.

మెగా ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి మండల శాఖ సహకారంతో ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం మెగా ఆరోగ్య శిబిరం నిర్వహిస్తామని రెడ్‌క్రాస్ సొసైటీ ఎల్లారెడ్డి మండల చైర్మన్ జనార్దన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన వారికి, వికలాంగులకు ఈసీజీ, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, రక్త పరీక్షలు ఉచితంగా చేసి అవసరమైన వారికి మందులు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్డిఓ మన్నే ప్రభాకర్, తహసిల్దార్ మహేందర్ కుమార్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీంద్ర మోహన్, డీఎస్పీ శ్రీనివాసులు, సిఐ రవీందర్ నాయక్, ఎస్ఐ మహేష్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. కావున ఎల్లారెడ్డి పరిసర ప్రాంత ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

శాబ్దిపూర్ పాఠశాలకు పోడియం వితరణ

నవతెలంగాణ-కామారెడ్డి

రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం శాబ్దిపూర్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలకు పోడియం వితరణ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పోలబోయిన సత్యం మాట్లాడుతూ.. విద్యార్థులు ఇప్పటినుంచే చక్కగా ఉపన్యసించటం అలవాటు చేసుకోవాలని, తద్వారా భవిష్యత్తులో మంచి వక్తలుగా ఎదిగే అవకాశం ఉంటుందని అన్నారు. తద్వారా సమాజంలో గుర్తింపు తెచ్చుకోగలుగుతారని, దానికి ఈ పోడియం ముందు నిలబడి మాట్లాడే స్థైర్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రాజనర్సింహారెడ్డి, సభ్యులు గడ్డం గంగారెడ్డి, కోడిప్యాక సత్యనారాయణ, సబ్బని కృష్ణహరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బాలగౌడ్, లక్ష్మారెడ్డి, మురికి సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా దూపల్లి గేట్ రోడ్డు


గుంతలమయంగా మారిన రోడ్డు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి గేటు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దాంతో అవి ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. భారీ వాహనాలతో పాటు, ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే జంకుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

కందకుర్తి గోదావరిలో భక్తుల కిటకిట


భక్తులతో కిటకిటలాడుతున్న గోదావరి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం వద్ద శుక్రవారం భక్తులు అత్యధిక సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోదావరిలో స్నానాలు ఆచరించి పురాతన రాతి శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పిండివంటలు చేసి తెప్పలను విడిచిపెట్టారు.

బిజినెస్

శ్రీరామ్ ఫార్మ్ నుంచి ఐదు పంట సంరక్షణ ఉత్పత్తులు



హైదరాబాద్ : ఐదు రకాల నూతన తరం పంట సంరక్షణ, స్పెషాలిటీ ప్లాంట్ న్యూట్రిషన్ ఉత్పత్తులను ఆవిష్కరించినట్లు శ్రీరామ్ ఫార్మ్ సొల్యూషన్స్ తెలిపింది. హైదరాబాద్‌లో వీటిని ఛానెల్ భాగస్వాముల సమక్షంలో విడుదల చేసినట్లు ఆసంస్థ పేర్కొంది. కలుపు నిర్వహణ పరిష్కారానికి శ్రీరామ్ బికుటాను పరిచయం చేసినట్లు వెల్లడించింది. అదే విధంగా తన క్రిమిసంహారక పోర్ట్‌ఫోలియోలో శ్రీరామ్ సైషో, శ్రీరామ్ క్రోస్, శ్రీరామ్ ట్రెక్చురల్, స్పెషాలిటీ ప్లాంట్ న్యూట్రిషన్ అయినా శ్రీరామ్ ప్రోటోబజ్‌ను పరిచయం చేసినట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ చబ్రా తెలిపారు.

ఏపీ, తెలంగాణ రైతులకు స్వరాజ్ అధునాతన పడ్లింగ్ సొల్యూషన్స్



నవతెలంగాణ - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లలో ప్రత్యేకంగా మాగాణి నేలల్లో సాగులో తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు మహీంద్రా గ్రూప్లో భాగమైన స్వరాజ్ ట్రాక్టర్స్ సమగ్రమైన పడ్లింగ్ సొల్యూషన్స్ను అందిస్తోంది. స్వరాజ్ 843 ఎఫ్ఎం, 742 ఎక్స్‌టీ, 744 ఎఫ్ఎస్ఈ మరియు స్వరాజ్ 855 ఎఫ్ఎస్ఈ అనే స్వరాజ్ మోడల్స్ లో అధునాతన ఫీచర్లు పొందుపర్చబడ్డాయి. ఇవి అధిక సామర్థ్యంతో, మెరుగైన నియంత్రణతో, ఉపయోగించేందుకు మరింత సులభతరంగా ఉంటాయి. తద్వారా రైతులకు పడ్లింగ్ పనుల్లోను, వరి సాగులోను ఇవి సరైన ఎంపిక కాగలవు. స్వరాజ్ ట్రాక్టర్లు 4-వీల్ డ్రైవ్ ఆప్షన్తో లభిస్తాయి. తడి, బురద నేలల్లో కూడా ఇవి అత్యుత్తమ కర్షణ సామర్థ్యాన్ని అందిస్తాయి. పనులు నిరాటంకంగా సాగేందుకు, జారి పడే సమస్యలు తలెత్తకుండా ఇవి సమర్థంగా పని చేస్తాయి. అంతేగాకుండా, ఇండిపెండెంట్ పవర్ టేక్-ఆఫ్ (ఐపీటీవో) వల్ల పీటీవో-చాలిత సాధనాలపై పూర్తి నియంత్రణ లభిస్తుంది. అలాగే పనితీరు, విశ్వసనీయత కూడా మెరుగ్గా ఉంటుంది. ఈ ట్రాక్టర్లలో 12 ఫార్వర్డ్, 3 రివర్స్ గేర్లతో విస్తృతమైన స్పీడ్ శ్రేణి ఉంటుంది.

టెక్ ప్లాట్‌ఫారమ్‌తో బీమా ఆఫర్‌ను పునర్నిర్వచిస్తున్న హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో

నవతెలంగాణ - హైదరాబాద్

భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ రంగ సాధారణ బీమా సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, తన ప్రధాన కార్యాచరణ వ్యాపార ప్రక్రియల పునరుద్ధరణతో ఒక మైలురాయి చేరవను సగర్వంగా ప్రకటిస్తోంది. డక్ క్రీక్ ప్లాట్‌ఫారమ్‌కు చెందిన నూతన-తరపు సాంకేతిక సామర్థ్యాలను ఉపయోగించుకోవడం, భారీ కార్యాచరణ సామర్థ్యాలతో 'డిజిటల్ ఫస్ట్' బీమా సంస్థ నిబద్ధత దిశగా సంస్థ ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ఈ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తరణతో, బీమా సంస్థ ఇప్పుడు వినియోగదారులకు మెరుగైన అంతరాయం లేని, సహజమైన అనుభవాలను అందించేందుకు మరియు మెరుగైన హైపర్ పర్సనలైజ్డ్ బీమా పరిష్కారాలను అందించేందుకు సిద్ధంగా ఉంటుంది. అంతేకాకుండా, ఈ నూతన-తరపు సాంకేతికత బీమాను మరింత సరసమైనదిగా, ఎక్కువమంది వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అనుకూలీకరించిన ఉత్పత్తుల రోల్-అవుట్, నూతన తరపు ఇన్సర్‌టెక్‌లతో టై-అప్ చేయడం ద్వారా ఎక్కువ విభాగాలకు నూతన వినియోగదారులు చేరుకునేందుకు బీమా సంస్థను అనుమతిస్తుంది.

జైస్వాల్‌ను ఓపెనర్ పంపించాలి: శ్రీశాంత్

నవతెలంగాణ - హైదరాబాద్

ఐసీసీ మెన్స్ టీ20 వరల్డ్ కప్ 2024లో రోహిత్ శర్మతో కలిసి ప్రారంభించడంపై ప్రముఖ క్రికెటర్ శ్రీశాంత్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. యశస్వి జైస్వాల్‌ను చూడటానికి నేను ఇష్టపడతాను అని పేర్కొన్నారు. "విరాట్ కోహ్లి మూడవ స్థానంలో (నంబర్ 3) వస్తున్నందున ఈ టి20 ఫార్మాట్లో రోహిత్ శర్మతో కలిసి యశస్వి జైస్వాల్ ఇన్నింగ్ ప్రారంభిస్తే బాగుంటుంది. ఈ విషయంలో విరాట్ కోహ్లి వద్ద తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించే స్వేచ్ఛ యశస్వి జైస్వాల్కు ఉంటుంది. నా తర్వాత బ్యాటింగ్ చేసేందుకు విరాట్ భాయ్ (విరాట్ కోహ్లి) ఉన్నాడనే ధైర్యంతో రోహిత్ శర్మ షీట్-యాంకర్ పాత్రను పోషిస్తే, యశస్వి జైస్వాల్ స్వేచ్ఛగా ఆడేందుకు అవకాశం ఉంటుంది. విరాట్ కోహ్లి వచ్చి ఇన్నింగ్స్ను స్థిరీకరించి స్కోర్ను బోర్డుపై ఉంచుతాడు లేదా యశస్వి జైస్వాల్ బౌలింగ్ తర్వాత ఓపెనింగ్ చేయడం, విరాట్ కోహ్లి వచ్చి రోహిత్ శర్మతో ఆటను ముగించడం వంటివి ఏమీ ఇబ్బంది కలిగించవు" అని అభిప్రాయపడ్డారు. ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ 2024 డిస్నీ హాట్‌స్టార్లో మొబైల్లో ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది.

ఒకే వేదికపైకి చంద్రబాబు, రేవంత్..

- వచ్చే నెల 20,21 తేదీల్లో హైదరాబాద్‌లో కమ్మ మహాసభ
- హాజరుకానున్న ఇరువురు సీఎంలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌లు ఒకే వేదికను పంచుకోనున్నారు. వచ్చే నెల 20,21 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే కమ్మ మహాసభకు వారిద్దరూ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. సీఎంలుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చంద్రబాబు, రేవంత్ ఇప్పటి వరకూ కలుసుకోలేదు. అందువల్ల జులైలో వారి భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. గత డిసెంబరులో రేవంత్ సీఎంగా ప్రమాణం చేసినప్పటికీ... అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌తో భేటీ కాలేదు. అటు వైపు నుంచి జగన్ కూడా రేవంత్‌ను కలవలేదు. ఈలోగా ఏపీలో ఎన్నికలు రావటం, ఆ తర్వాత జగన్ ఓడిపోవటం చకచకా జరిగాయి. అనంతరం చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి రేవంత్‌కు ఆహ్వానం అందిందా? లేదా ? అన్నది తెలియదు గానీ, ఆయన ఆ కార్యక్రమానికి హాజరు కాలేదు. చంద్రబాబు ఎన్డీయే కూటమిలో ఉన్న నేపథ్యంలో... ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎంగా రేవంత్ ఆ కార్యక్రమానికి గైర్హాజరయ్యారనే అభిప్రాయాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో త్వరలో జరగబోయే వీరిద్దరి భేటీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఒకే వేదికను పంచుకోనున్న సీఎంలు ఇరు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలపై చర్చిస్తారా? లేదా..? అన్నది వేచి చూడాలి. కాగా కమ్మ మహాసభకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా హాజరుకానున్నారని నిర్వాహకులు జెట్టి కుసుమకుమార్ తెలిపారు.

పాడి రైతులు ఆందోళన చెందొద్దు

- విజయా డెయిరీ ప్రకటన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

విజయ తెలంగాణ పాడి రైతులకు గిట్టుబాట ధర కల్పించాలనే సదుద్దేశంతో ఎన్నడూ లేని విధంగా పాల సేకరణ ధరను పెంచామని విజయ డెయిరీ అని ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలో పాలసేకరణ పెరగడంతో రైతులకు చెల్లించాల్సిన బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నదని తెలిపింది. రైతులు ఆందోళన చెందొద్దనీ, త్వరలోనే బకాయి బిల్లులు చెల్లిస్తామని రైతులకు విజ్ఞప్తి చేసింది.

గెస్ట్ లెక్చరర్ల కొనసాగింపు

- ఇంటర్ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 1,654 మంది గెస్ట్ లెక్చరర్లను 2024-25 విద్యాసంవత్సరంలో కొనసాగిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ శృతి ఓజా శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. గత విద్యాసంవత్సరంలో పనిచేసిన వారిని ప్రస్తుత విద్యాసంవత్సరంలోనూ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఉత్వర్వులను విడుదల చేయడం పట్ల గెస్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దామెర ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి దార్ల భాస్కర్ హర్షం ప్రకటించారు.

జులై 18 నుంచి డీఎస్సీ రాతపరీక్షలు

ఆగస్టు 5 వరకు నిర్వహణ

- ఆన్‌లైన్‌లో రోజు రెండు విడతల్లో
- పూర్తిస్థాయి షెడ్యూల్ విడుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మెగా డీఎస్సీ రాతపరీక్షలు కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో ఆన్‌లైన్‌లో వచ్చేనెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆగస్టు ఐదో తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. పోస్టు కేటగిరీ, మాధ్యమం వారీగా డీఎస్సీ రాతపరీక్షలకు సంబంధించిన పూర్తిస్థాయి షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం విడుదల చేశారు. మెగా డీఎస్సీకి 2,79,966 దరఖాస్తులొచ్చిన విషయం తెలిసిందే. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సంగతి విదితమే. ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో రెండో విడతల్లో రాతపరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. వచ్చేనెల 18న మొదటి విడతలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్), స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) తెలుగు మాధ్యమం అభ్యర్థులకు రాతపరీక్షలుంటాయని పేర్కొన్నారు.

రెండో విడతలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) పోస్టుకు హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, కన్నడ, తెలుగు మాధ్యమాల్లో పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు.

అదేనెల 19న మొదటి విడత, రెండో విడతలో ఎస్జీటీ తెలుగు మాధ్యమం అభ్యర్థులకు పరీక్షలుంటాయని వివరించారు. ఆగస్టు ఐదో తేదీన మొదటి విడతలో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు మాధ్యమంలో, రెండో విడతలో లాంగ్వేజ్ పండిట్ (హిందీ) అభ్యర్థులకు రాతపరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.



(ఫైల్)

మెగా డీఎస్సీ ఆన్‌లైన్‌లో రాతపరీక్షల వివరాలు

పరీక్ష తేదీ		కేటగిరీ	మాధ్యమం
జులై 18న	మొదటి విడత	స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్)	తెలుగు
		స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)	
	రెండో విడత	పీఈటీ	హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, కన్నడ
జులై 19న	మొదటి విడత	ఎస్జీటీ	తెలుగు
	రెండో విడత	"	"
జులై 20న	మొదటి విడత	ఎస్జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్)	ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు
	రెండో విడత	స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్)	తెలుగు, ఉర్దూ
జులై 22న	మొదటి విడత	ఎస్జీటీ	తెలుగు
	రెండో విడత	స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)	ఇంగ్లీష్, హిందీ, కన్నడ, మరాఠీ, తెలుగు, ఉర్దూ
జులై 23న	మొదటి విడత	ఎస్జీటీ	ఇంగ్లీష్, తెలుగు
	రెండో విడత	"	తెలుగు
జులై 24న	మొదటి విడత	స్కూల్ అసిస్టెంట్ (బయలాజికల్ సైన్స్)	తెలుగు
జులై 25న	మొదటి విడత	స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)	--
	రెండో విడత	స్కూల్ అసిస్టెంట్ (ఉర్దూ, తెలుగు,ఇంగ్లీష్, మరాఠీ)	
జులై 26న	మొదటి విడత	లాంగ్వేజ్ పండిత్ (తెలుగు)	--
		ఎస్జీటీ	హిందీ, బెంగాలీ, కన్నడ తమిళం, ఉర్దూ, మరాఠీ
	రెండో విడత	పీఈటీ	తెలుగు
జులై 30న	మొదటి విడత	స్కూల్ అసిస్టెంట్ (సోషల్)	హిందీ, తెలుగు, ఉర్దూ, మరాఠీ
	రెండో విడత	"	ఇంగ్లీష్, తెలుగు
జులై 31న	మొదటి విడత	స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)	తెలుగు
			హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, మరాఠీ
		స్కూల్ అసిస్టెంట్ (బయలాజికల్ సైన్స్)	తెలుగు
	రెండో విడత	స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)	తెలుగు, ఉర్దూ
ఆగస్టు 1న	మొదటి విడత	ఎస్జీటీ	ఇంగ్లీష్, తెలుగు
	రెండో విడత	స్కూల్ అసిస్టెంట్ (సోషల్)	తెలుగు
ఆగస్టు 2న	మొదటి విడత	లాంగ్వేజ్ పండిట్ (తెలుగు)	--
	రెండో విడత	స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)	తెలుగు, ఉర్దూ
		స్కూల్ అసిస్టెంట్ (హిందీ, కన్నడ, మరాఠీ, సంస్కృతం, ఉర్దూ)	
ఆగస్టు 5న	మొదటి విడత	స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)	ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు
	రెండో విడత	లాంగ్వేజ్ పండిట్ (హిందీ)	

సీపీఎస్‌ను రద్దు చేయండి

- ఆదాయపు పన్ను పరిమితిని పెంచండి
- కేంద్ర ఆర్థిక మంత్రికి టీఎన్జీవో, టీజీవో వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని టీఎన్జీవో, టీజీవో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఆదాయపు పన్ను పరిమితిని రూ.రెండున్నర లక్షల నుంచి రూ.పది లక్షలకు పెంచాలని కోరాయి. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి కె నిర్మలాసీతారామన్‌ను శుక్రవారం టీఎన్జీవో, టీజీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఉన్న పన్ను విధానంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లు దాదాపుగా మూడు నెలల వేతనాన్ని ఆదాయపన్ను పరిధి కింద కోల్పోతున్నారని తెలిపారు. మెడికల్ ఖర్చులు, విద్య మీద పెట్టే ఖర్చులు పెరుగుతున్న సందర్భంగా అదనంగా రూ.ఏడున్నర లక్షలకు ఆదాయపు పన్ను పరిమితిని పెంచాలని పేర్కొన్నారు. సేవింగ్ పరిమితిని రూ.ఒకటిన్నర లక్షల నుంచి రూ.నాలుగు లక్షలకు పెంచాలని కోరారు. హౌసింగ్ రుణాల మీద వడ్డీని రూ.4.50 లక్షలకు పెంచాలని సూచించారు. మెడికల్ ఇన్సూరెన్స్‌కు సంబంధించి రూ.25 వేల పరిమితిని రూ.50 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ అంశాల పట్ల కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. సీపీఎస్ రద్దు విషయంలో కేంద్రం పరిధిలో ఒక కమిటీని వేశామనీ, ఆ నివేదిక వచ్చిన తర్వాత అందులోని అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలించి తప్పకుండా సీపీఎస్‌ను రద్దు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఆదాయపన్ను పరిధి పరిమితి విషయంలో తప్పకుండా మోడీ ప్రభుత్వం వేతన జీవులను ఆదుకునే పద్ధతిలో అతి త్వరలో కొత్త విధానాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఈ విషయంలో ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం రాకుండా ఉండేటట్టు కేంద్ర ఆర్థిక శాఖ పక్షాన తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల ముత్యాల సత్యనారాయణగౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, టీజీవో నాయకులు రామారావు, నరహరి, తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞశాలి పీవీ

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ పీవీ ఘాట్ వద్ద నివాళి



నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన ఆర్థిక విధానాల రూపశిల్పి, బహుముఖ ప్రజ్ఞాశాలి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని, దేశ ప్రధానిగా ఆయన సేవలు మరువలేనివని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 103వ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పీవీ జ్ఞానభూమి, పీవీ ఘాట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పీవీ నూతన ఆర్థిక విధానాల రూపాశిల్పి అని, భూసంస్కరణలు, ఆర్థిక సంస్కరణలు తేవడంతో భారతదేశం ప్రపంచంలో ఆర్థిక శక్తిగా ఎదుగుతుందన్నారు.

ఫామ్ హౌస్‌కు పంపినా కేసీఆర్‌కు బుద్ధి రాలేదు

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి ఫామ్‌హౌస్‌కు పంపినా మాజీ సీఎం కేసీఆర్‌కు బుద్ధి రాలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు.అధికారంపై ఆయన ఇంకా పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియాపాయింట్‌లో రామ్మోహన్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. సీఎం కుర్చీ నుంచి జనం లాగి పడేసినా కేసీఆర్ వాస్తవాన్ని గ్రహించడం లేదన్నారు. బాద్‌షా సినిమాలో బ్రహ్మానందం క్యారెక్టర్‌లా ఆయన తీరు ఉందన్నారు. ప్రజాపాలన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తావా? అని ప్రశ్నించారు. నిరుద్యోగుల సమస్యలంటూ కేటీఆర్ ఇంకా డ్రామాలాడుతున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యం వల్లే సీతారామ ప్రాజెక్టు ఆలస్యం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యం వల్లే సీతారామ ప్రాజెక్టు ఆలస్యమైందని సత్తుపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే మట్టా రాగమయి విమర్శించారు. ఆ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు వరప్రదాయని అన్నారు. 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు ట్రయల్ రన్ పట్ల రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. 2014 కు ముందే మూడు వేల కోట్ల అంచనాతో దుమ్ముగూడెం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం మొదలుపెట్టిందనీ, కేసీఆర్ రీ డిజైన్ పేరుతో కాలయాపన చేశారని విమర్శించారు. రూ. 18,500 వేల కోట్లకు అంచనా వ్యయం పెంచారనీ, ప్రాజెక్టు పూర్తి చేయకుండా సగం తొవ్వి వదిలేశారని గుర్తు చేశారు. నిర్వాసితులకు పరిహారం కూడా ఇవ్వలేదని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఈ ఏడాది 1.2 లక్షల ఎకరాలకు నీళు ఇవ్వబోతున్నట్టు తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో టన్నల్‌ను వచ్చే ఏడాది పూర్తి చేసి సాగు నీరు అందిస్తామన్నారు. జిల్లాకు అండగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు ఆమె ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు చెప్పారు.

జాతీయ ఉత్తమ టీచర్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

- రిజిస్ట్రేషన్‌కు తుది గడువు జులై 15

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ ఏడాదికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి కేంద్ర విద్యాశాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నదని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో వాటి సమర్పణకు వచ్చేనెల 15 వరకు గడువుందని పేర్కొన్నారు. దరఖాస్తులను http://nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆ వెబ్‌సైట్‌ను సంప్రదించి ఎంపిక మార్గదర్శకాలు, ఇతర వివరాలను తెలుసుకోవాలని కోరారు.

దీర్ఘకాలిక ఆర్థిక లోటుపై అమెరికాకు ఐఎమ్ఎఫ్ హెచ్చరిక



అమెరికా లోటు బడ్జెట్లు, చేస్తున్న విపరీతమైన అప్పులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెరుగుతున్న ప్రమాదాన్ని తెలియజేస్తున్నాయని, అవి తక్షణమే పరిష్కరించబడాలని అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్-ఐఎమ్ఎఫ్) గురువారం హెచ్చరించింది. అమెరికా జాతీయ రుణం 35 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటోందని డేటా చూపిస్తుంది. తాజా గణాంకాల ప్రకారం, అమెరికా ఫెడరల్ బడ్జెట్ లోటు 2022 ఆర్థిక సంవత్సరంలో 1.4 ట్రిలియన్ నుంచి గత సంవత్సరం 1.7 ట్రిలియన్లకు పెరిగింది. ద్రవ్యలోటు ఈ సంవత్సరం 1.9 ట్రిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉందని అమెరికాలోని అధికారిక ఆర్థిక పర్యవేక్షణ సంస్థ అయిన కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ ఈ నెల ప్రారంభంలో అంచనా వేసింది. ఇది స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ)లో 7శాతానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇటువంటి అధిక లోటులు, అప్పులు అమెరికా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు పెరుగుతున్న ప్రమాదాన్ని, అధిక ఆర్థిక ఫైనాన్సింగ్ ఖర్చులకు, పరిపక్వ బాధ్యతలను సజావుగా జరగడానికి పెరుగుతున్న ప్రమాదాన్ని సూచిస్తాయి అని అమెరికా ఆర్థిక విధానాలపై జరిపిన సమీక్షలో ఐఎమ్ఎఫ్ పేర్కొంది. ఈ దీర్ఘకాలిక ఆర్థిక లోటులు నిరంతర విధానపరమైన లోపాలను సూచిస్తాయి. వీటిని అత్యవసరంగా పరిష్కరించాల్సిన అవసరం ఉంది అని అది జోడించింది. జనవరి 2023లో చట్టబద్ధంగా 31.4 ట్రిలియన్ డాలర్లుగా నిర్ణయించబడిన రుణ పరిమితిని అమెరికా అతిక్రమించింది. అమెరికా ట్రెజరీ నుండి ఆసన్న దివాళా గురించి నెలల తరబడి హెచ్చరికల తర్వాత అధ్యక్షుడు జో బైడెన్ జూన్ 2023లో రుణ బిల్లుపై సంతకం చేశారు. అది జనవరి 2025 వరకు పరిమితిని నిలిపివేసింది. ఇది ప్రభావవంతంగా వచ్చే ఏడాది వరకు పరిమితులు లేకుండా రుణాలు తీసుకోవడాన్ని ప్రభుత్వం అనుమతించింది. బిల్లు ఆమోదం పొందిన రెండు వారాలలోపే రుణభారం 32 ట్రిలియన్లకు పెరిగింది. అప్పటినుండి పెరుగుతూనే ఉంది. అమెరికా దూకుడు వాణిజ్య విధానాల పెరుగుదలను ఐఎమ్ఎఫ్ తీవ్రంగా విమర్శించింది. చైనాతో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా వ్యాపార పరిమితుల విస్తరణ, 2023 బ్యాంక్ వైఫల్యాల ద్వారా వెల్లడైన దుర్బలత్వాలు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తాయని ఐఎమ్ఎఫ్ పేర్కొంది. అమెరికా అధిక వ్యయంపై తాజాగా ఐఎమ్ఎఫ్ ఈ హెచ్చరిక చేసింది. అమెరికా రుణం-స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ) నిష్పత్తి రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అత్యధికంగా ఉందని మంగళవారంనాడు ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఇసిడి)పేర్కొంది. డెట్(అప్పు)-టు-జీడీపీ నిష్పత్తి ని ఒక దేశం చేసిన అప్పులను తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ఉపయోగిస్తారు.

ఓఇసిడి ప్రకారం గత సంవత్సరం అమెరికా రుణం దాని జీడీపీలో లో 122 శాతానికి పెరిగింది.

ప్రపంచ గమనం

బ్రిక్స్‌లో చేరేందుకు కాంగో ఆసక్తి



బ్రిక్స్‌లో సభ్యత్వం పొందేందుకు తమ దేశ ఆసక్తిని రిపబ్లిక్ ఆఫ్ కాంగో అధ్యక్షుడు డెనిస్ సస్సౌ న్గెస్సో వ్యక్తం చేశారు. ఆఫ్రికన్ నాయకుడు ఈ వారం రష్యా చేరుకున్నారు. అక్కడ అతను అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమయ్యారు. ఆఫ్రికా దేశం బ్రిక్స్‌తో సంబంధాలను పెంపొందించుకోవడానికి ఆసక్తి చూపుతుందని గురువారంనాడు రష్యా మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సస్సౌ న్గెస్సో నొక్కి చెప్పారు. 'బ్రిక్స్‌ను 2006లో బ్రెజిల్, రష్యా, భారతదేశం, చైనా స్థాపించాయి. దక్షిణాఫ్రికా 2011లో చేరింది. ప్రస్తుతం రష్యా బ్రిక్స్ చైర్మెన్‌గా ఉంది. ఈ సంవత్సరం ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పూర్తి సభ్యులుగా మారినప్పుడు బ్రిక్స్ విస్తరించింది' అని తెలిపారు.

సస్సౌ న్గెస్సో మంగళవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమైన సందర్భంగా ఆఫ్రికన్ నాయకుడికి రష్యన్ ఆర్డర్ ఆఫ్ ఆనర్ లభించింది. రష్యన్ ఫెడరేషన్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో మధ్య సంబంధాల అభివద్ధి, పటిష్టతలకు ఆయన చేసిన గణనీయమైన కషికి డెనిస్ సాసౌ న్గెస్సో ఈ అవార్డును అందుకున్నారు.

ఈ సమావేశంలో, రష్యా-కాంగోల సంబంధాల అభివద్ధికి సాసో న్గెస్సో గణనీయమైన వ్యక్తిగత సహకారం అందించాడని పుతిన్ మెచ్చుకున్నారు. సాసో న్గెస్సో రెండు రష్యా-ఆఫ్రికా శిఖరాగ్ర సమావేశాలలో పాల్గొన్నారు. మేము అన్ని రంగాలలో మా సహకారాన్ని ముందుకు తీసుకెళ్లడానికి అవసరమైన ప్రయత్నాలు చేస్తున్నాము అని పుతిన్ చెప్పారు. రష్యా, రిపబ్లిక్ ఆఫ్ కాంగో దౌత్య సంబంధాల 60వ వార్షికోత్సవాన్ని ఈ సంవత్సరం జరుపుకుంటున్నారు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని కాంగో గౌరవ కాన్సుల్ జోసెలిన్-పాట్రిక్ మాండ్‌జెలా ప్రకారం, సాసౌ న్గెస్సో ఉత్తర రష్యన్ నగరాన్ని కూడా సందర్శిస్తారు. అక్కడ స్థానిక గవర్నర్‌తో సమావేశమవటంతోపాటు అనేక కార్యక్రమాలలో పాల్గొంటారు. జూన్ ప్రారంభంలో, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ కాంగోకు అధికారిక పర్యటన చేశారు. అక్కడ ఆయన దేశ నాయకత్వంతో చర్చలు జరిపారు. వాణిజ్యం, ఆర్థిక సంబంధాలను పెంపొందించడం, ఇంధన రంగ ప్రాజెక్టులను అభివద్ధి చేయడం, సైనిక-సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేయడంవంటి విషయాలపై లావ్రోవ్ చర్చించాడు.